

యువతరంగం

ఎస్వీయూలో 'యువతరంగ్- 2025' కార్యక్రమం ఉత్సాహంగా మొదలైంది. కళలు, చిత్రలేఖనం తదితర 30 అంశాలపై జరిగిన పోటీల్లో విద్యార్థులు పాల్గొన్నారు.

8

● వానెల్లూరు భూ అక్రమాల్లో

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నాటి తహసీల్దార్, సిబ్బందిపై వేటు

సత్యవేడు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు మండలం వానెల్లూరు రెవెన్యూలో అటవీ భూములకు పట్టాలు సృష్టించి అక్రమాలకు పాల్పడిన అప్పటి తహసీల్దార్, సిబ్బందిపై వేటు పడింది. వారిని సస్పెండు చేస్తూ రాష్ట్ర భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) జయలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో సత్యవేడు తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది అక్రమార్కులతో కుమ్మక్కై వానెల్లూరు రెవెన్యూ పరిధిలో సుమారు 300 ఎకరాలకు నకిలీ పట్టాలు సృష్టించారు. ఈ భూ కుంభకోణంపై ఆంధ్రజ్యోతిలో ఈనెల 8వ తేదీన 'రెవెన్యూలో మాయాజాలం' శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన కలెక్టర్ వెంకటేశ్వర్.. బాధ్యులైన అధికారులు, సిబ్బంది, అక్రమార్కులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని జేసీని ఆదేశించారు. దీంతో తహసీల్దార్ రాజశేఖర్ ఈనెల 10వ తేదీన సత్యవేడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఐ మురళి కేసు నమోదు చేశారు. ప్రాథమిక దర్యాప్తులో బాగంగా అప్పటి తహసీల్దార్ రామాంజనేయులు (ప్రస్తుతం కర్నూలు జిల్లా దేవరకొండలో పనిచేస్తున్నారు), ఆర్ఐ సురేష్, వీఆర్వోలు రాఘవేంద్ర, భార్గవ్ (ప్రస్తుతం పాకాల మండలం చెన్నుగారిపల్లెలో విధులు), అతడి భార్య తేజస్వి, విలేజ్ సర్వేయర్ వెంకటేష్, డేటా ఎంట్రీ ఆపరేటర్ జగదీష్, సచివాలయ సిబ్బంది పూర్ణచంద్రతోపాటు పట్టాలు పొందిన పి.శ్రీధరన్, అమృతవర్షిణి, నవీన్ రాజ్‌ఖన్నా, అనురాధ జయకుమార్, లతజయ్‌కుమార్, ఆశాసురేష్, పట్టాల సృష్టికి ఆధార్ కార్డులు సమర్పించిన మల్లీశ్వరి, బత్తెమ్మ పేర్ల మీద ఐపీసీ 120ఏబీ, 420, 466, 467 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అదే విధంగా రెవెన్యూ అధికారులపై ప్రభుత్వం శాఖాపరమైన చర్యలకు ఉపక్రమించింది. ఇందులో భాగంగా అప్పటి తహసీల్దార్ రామాంజనేయులు, ఆర్ఐ సురేష్, వీఆర్వోలు రాఘవేంద్ర, బార్గవ్, సచివాలయ అగ్రికల్చర్ ఎంపీఈవో పూర్ణచంద్ర నాయుడు, డేటా ఎంట్రీ ఆపరేటర్ జగదీష్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

అడ్డదారులతో అంధకారంలోకి...

వానెల్లూరు భూ కుంభకోణంలో సస్పెండైన ఆరుగురు రెవెన్యూ ఉద్యోగుల్లో నలుగురు సచివాలయ సిబ్బంది కావడం గమనార్హం. గత ప్రభుత్వంలో సచివాలయ రెవెన్యూ సిబ్బందిగా విధుల్లో చేరిన వీరు. కేవలం నాలుగు సంవత్సరాల కాలంలోనే అవినీతిలో పట్టాలు పొందే స్థాయికి చేరడం విశేషం. ఉద్యోగపరంగా వీరికి ఎంతో భవిష్యత్తు ఉన్నా అడ్డదారులు తొక్కి తమ విలువైన భవిష్యత్తును చేజేతులా అంధకారంలోకి జారవిడుచుకున్నారు.

● రాజస్థాన్ ఘటనతో అధికారులు మేల్కోవాలి
● ప్రమాణాలు, నిబంధనలపై దృష్టి పెట్టాలి

స్లీపర్ బస్సుల్లో భద్రత ఎంత?

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్లీపర్ ఏసీ బస్సుల్లో భద్రత ఎంత? రవాణా శాఖ ప్రామాణికాలు, నిబంధనలు ఎంత వరకు పాటిస్తున్నారు? అసలు విద్యుత్ కనెక్షన్లు, వైర్లు ఎంతవరకు సేఫ్టీగా ఉన్నాయి? రాజస్థాన్ ఉదంతంతో తలెత్తుతున్న ప్రశ్నలివి. మంగళవారం రాజస్థాన్‌లో ఏసీ స్లీపర్ బస్సులో మంటలు వ్యాపించడంతో కనీసం 20 మంది మరణించారు. ఈ ప్రమాదానికి షార్ట్ సర్క్యూటే కారణమని భావిస్తున్నారు. దీంతో మన బస్సుల భద్రతపైనా అధికారులు మరింతగా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఇటు బస్సుల నిర్వాహకులు, అటు అధికారులపై ఉంది. కొన్ని బస్సుల్లో ఫైర్ ఫైటింగ్ వ్యవస్థ ఎలా పనిచేస్తోందనే విషయాన్ని పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. అంతకుమించి వీటిపై ప్రయాణికులకూ అవగాహన లేకపోవడం వారికి కలిసివస్తోంది. తిరుపతి ప్రముఖ పుణ్యక్షేత్రం కావడంతో ఇక్కడ నుంచి విజయవాడ, విశాఖపట్నం, బెంగళూరు, కాకినాడ, హైదరాబాదు, చెన్నై వంటి నగరాలకు రోజుకు 15 నుంచి 20 ఏసీ స్లీపర్ ఆర్టీసీ, ప్రైవేటు బస్సులు నడుపుతున్నారు. ఇక బెంగళూరు నుంచి తిరుపతి మీదుగా వెళ్లే బస్సులు దాదాపు 30 వరకు ఉన్నాయి.

ఇలా చేయాలి..

● స్లీపర్ ఏసీ బస్సుల్లో రెండు డోర్లు ఉండాలి. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు వెంటనే ప్రయాణికులు బయటకు వచ్చేలా ఎగ్జిట్ డోర్ సిస్టమ్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి.

● ప్రతి ఐదు సీట్లకు ఒక సుత్తిని ఉంచాలి. లేకుంటే సైడ్ అద్దాలు పగులకొట్టడం అసాధ్యమని అధికారులు చెబుతున్నారు.

● బస్సుల్లో వైర్లు, ఏసీ, ఇంజన్ సామర్థ్యం పరిశీలించుకోవాలి. ఆరు నెలలకోసారి ఎలక్ట్రికల్, ఏసీ మెకానిక్, అగ్నిమాపక శాఖ సిబ్బంది ద్వారా తనిఖీలు చేయించుకోవాలి. ఏవైనా లోటుపాట్లుంటే సరిదిద్దాల్సిన బాధ్యత ట్రాన్స్‌పోర్టు యాజమానులపై ఉంది. బస్సుల్లో పాత వైర్లుంటే మార్చాలి.

● బస్సుల్లో అంతర్గత కండిషన్ వ్యవస్థపై నిఘా ఉంచాలి.



అప్రమత్తత.. అందరి బాధ్యత



ఏసీ స్లీపర్ బస్సు డ్రైవర్లు గంటకు 120 నుంచి 140 కిలోమీటర్ల వేగంలో వెళ్తుంటే.. ప్రయాణికులు అడ్డు చెప్పాలి. ప్రతి బస్సుకు ఎడమ, కుడి వైపుల్లో కనీసం రెండు ఎమర్జెన్సీ డోర్లుంటే అనుకోని ప్రమాదం జరిగితే దిగిపోవడానికి అవకాశాలుంటాయి. హాల్టింగ్ పాయింట్ల వద్ద ఎలక్ట్రిక్ మెకానిక్‌లు బస్సులను తనిఖీలు చేసి షార్ట్ సర్క్యూట్‌కు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఫైర్ ఫైటింగ్ వ్యవస్థపై ప్రయాణికులకూ అవగాహన కల్పించాల్సిన బాధ్యత డ్రైవర్లకు ఉండాలి. మేమూ వారానికోసారి తనిఖీలు చేసి అవగాహన కల్పిస్తున్నాం.

- మురళీమోహన్, డీటీవో, తిరుపతి

నేరం ఒప్పుకో?

● ఆ ఇద్దరు టీడీపీ నేతలు చేయించారని చెప్పు
● 'అంబేడ్కర్' ఘటనపై పోలీసులు కొట్టి.. బెదిరించారన్న అరుణ్

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆ ఇద్దరు టీడీపీ నేతల ప్రోద్బలంతో అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టానని చెప్పాలంటూ పోలీసులు కొట్టారని బాధితుడు అరుణ్ ఆరోపించారు. గురువారం తిరుపతి రుయాస్పత్రిలో ఆయన చికిత్స పొందారు. వెదురుకుప్పం మండలం దేవళంపేటలో అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన ఘటనకు సంబంధించి వైసీపీకి చెందిన బొమ్మయ్యపల్లె సర్పంచి గోవిందయ్యను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో వైసీపీ నాయకులు కాకుండా టీడీపీ వారే చేయించారని పోలీసులు బెదిరించారంటూ దేవళంపేటవాసి అరుణ్ చెబుతున్నారు. 'ఈనెల 13వ తేది పోలీసులు వచ్చి నన్ను ఎస్ఐ పిలుస్తున్నారంటూ ఆటోలో ఎక్కించుకుని స్టేషన్‌కు తీసుకెళ్లారు. టీడీపీ నేతలు సతీష్ నాయుడు, కిషన్‌చందు మందుపోయించి అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టించారని చెప్పాలన్నారు. వాళ్లు చెప్పడంతో మరో ఇద్దరితో కలిసి చెరువు మార్గంలో వచ్చి నిప్పు పెట్టి వెళ్లినట్లు ఒప్పుకోవాలని కొట్టారు. మద్యం తాగించి బలవంతంగా చెప్పించడానికి ప్రయత్నించారు. స్టేషన్‌లో కాళ్లకు గొలుసులువేసి బంధించి చిత్రహింసలు పెట్టారు. బోర్లా పడుకోబెట్టి వీపుపై, చేతులు, కాళ్లపై కొట్టారు. పోలీసుల లాఠీ చార్జి దెబ్బలకు శరీరమంతా కమిలిపోయింది' అంటూ కొందరు మీడియా ప్రతినిధుల వద్ద దేవళంపేటకు చెందిన అరుణ్ ఆవేదన వ్యక్తంచేశారు. గురువారం మధ్యాహ్నం 11.51 గంటలకు చికిత్స నిమిత్తం ఆయన తిరుపతి రుయాస్పత్రిలోని అత్యవసర విభాగంలో చేరారు. పోలీసులు కొట్టడంతో గాయాలైనట్లు డాక్టర్లకు చెప్పారు. ఇతడిని పరీక్షించిన వైద్యులు శరీరంపై దెబ్బలు బలంగా ఉన్నాయని, నోరు, ముక్కు నుంచి నెత్తురు కారుతోందని ధ్రువీకరించారు. మెడికో లీగల్ కేసు కింద ఆస్పత్రిలో రిజిస్టర్ చేసి వెదురుకుప్పం పోలీసులకు సమాచారం అందించారు. కాగా, మధ్యాహ్నం తర్వాత ఆస్పత్రి నుంచి ఆయన స్వచ్ఛందంగా డిశ్చార్జి అయి ఇంటికి వెళ్లారు.



చికిత్స నిమిత్తం రుయాస్పత్రికి వచ్చిన అరుణ్

ఎందుకా అత్యుత్సాహం?

అంబేడ్కర్ విగ్రహ ఘటన కేసును కార్వేటినగరం సీఐ దర్యాప్తు చేస్తున్నారు.కర్నూలులో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనకు సీఐ, ఎస్ఐ, కొందరు సిబ్బంది వెళ్లారు. ఈ క్రమంలో ఇద్దరు పోలీసులు 13వ తేది అరుణ్‌ను స్టేషన్‌కు తీసుకొచ్చి కొట్టారని, బుధవారం వదిలిపెట్టినట్లు బాధితుడి మాటలను బట్టి తెలుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించిన ఈ కేసులో.. అధికార టీడీపీ నేతలను ఇరికించేలా,వారి పేర్లు చెప్పాలంటూ ఆ పార్టీ కార్యకర్తను ఇలా హింసించడం వెనుక వీరి అత్యుత్సాహం ఏమిటి? అధికారులు లేనప్పుడు ఇంత ధైర్యంగా ఈ పని చేశారంటే.. వాళ్లకంత దన్ను ఇచ్చిన వాళ్లెవరు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

'ఆక్వా'కు రాయితీ విద్యుత్తు

● రిజిస్ట్రేషన్ చేసుకుంటే యూనిట్ ఒకటిన్నర రూపాయికే

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆక్వారంగానికి చేయూతనిచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాయితీతో విద్యుత్తు సరఫరాకు ఓకే చేసింది. ఆక్వా సాగుకు విద్యుత్ బిల్లులు యూనిట్‌కు రూ.3.80 చెల్లిస్తున్నారు. ఈ క్రమంలో యూనిట్ రూ.1.50 విద్యుత్ పథకాన్ని తీసుకొచ్చింది. దీనికోసం నిర్వాహకులు మత్స్యశాఖ అధికారుల వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. జిల్లాలో సముద్ర తీర ప్రాంతానికి ఆనుకుని ఉన్న కోట, వాకాడు, చిల్లకూరు, చిట్టమూరు మండలాల్లో 9,446 ఎకరాల్లో చేపలు, రొయ్యలు పెంచుతున్నారు. ఇక్కడ ప్రాసెసింగ్ ప్లాంట్ల నుంచి సుమారు 1200 టన్నుల ఆక్వా ఉత్పత్తులు అమెరికాకు ఎగుమతి అవుతున్నాయి. ఏటా సుమారు రూ.700కోట్ల వ్యాపారం జరుగుతోంది. కరెంటు ఛార్జీలు భారంగా మారుతున్నట్లు ఆక్వా సాగుదారులు విన్నవించారు. ఈ క్రమంలో సీఎం చంద్రబాబు యూనిట్ రాయితీ విద్యుత్తును ప్రవేశ పెట్టారు.



ఆక్వా రైతులూ రిజిస్ట్రేషన్ చేసుకోండి



జిల్లాలో 2,500మందికిపైగా రైతులు ఆక్వా సాగుచేస్తున్నారు. యూనిట్ విద్యుత్ రూ.1.50 కి పొందాలంటే రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. దీనికోసం ఆయా సచివాలయాల పరిధిలోని మత్స్యశాఖ సహాయకుల వద్దకు ధ్రువీకరణ పత్రాలు తీసుకెళ్తే ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేస్తారు. క్షేత్రస్థాయిలోనూ ధ్రువీకరించుకుంటాం. ఆ తర్వాత రాయితీ విద్యుత్తుకు అర్హులవుతారు.

- రాజేష్, జిల్లా మత్స్యశాఖ అధికారి



విస్తారంగా వరి సాగు

విజయపురం మండలంలో వరిసాగు విస్తారంగా సాగు చేస్తున్నారు.సకాలంలో మంచి వర్షాలు కురవడంతో ఎక్కువ మంది రైతులు వరిసాగు వైపు దృష్టి సారించారు. మాధవరం, కళియంబాకం, పన్నూరు, బూచివానత్తం, జగన్నాథపురం, విజయపురం, కాళికాపురం, జీఎంపురం, కేవీపురం ప్రాంతాల్లో వరినాట్లు జోరుగా సాగుతున్నాయి. కూలీలు అందుబాటులో లేకపోవడంతో ఎక్కువ మంది రైతులు వరినాటకు యంత్రాలను ఆశ్రయిస్తున్నారు.

- విజయపురం, ఆంధ్రజ్యోతి

శబరిమల యాత్రకు ప్రత్యేక ప్యాకేజీ టూర్

తిరుపతి అర్బన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కేరళలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శబరిమల యాత్రకు ప్రత్యేక ప్యాకేజీ టూర్(హైర్ టూర్ బస్సులు)ను ప్రవేశపెట్టినట్లు ఏపీ పర్యాటకాభివృద్ధి డీవీఎం శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. 36 సీట్ల నాన్ ఏసీ హైటెక్, 45సీట్ల ఏసీ ఓల్వో బస్సులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అయ్యప్ప భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 08772289123, 9848007033, 9848802099, 9848973985 లను సంప్రదించాలని కోరారు.

టైప్ రైటింగ్, షార్ట్‌హ్యాండ్ పరీక్షల షెడ్యూల్ విడుదల

తిరుపతి(విద్య), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): టైప్ రైటింగ్, షార్ట్‌హ్యాండ్ - 2026 పరీక్షల షెడ్యూల్‌ను రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణ మండలి గురువారం ప్రకటించింది. వచ్చే ఏడాది జనవరి 4న షార్ట్‌హ్యాండ్ పరీక్ష జరుగనుంది. 24, 25 తేదీల్లో టైప్ రైటింగ్ పరీక్షలు నిర్వహించనున్నారు. హాజరుకాగోరు విద్యార్థులు తమ సమీపంలోని టైప్ రైటింగ్ ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపాల్‌ను సంప్రదించి, పరీక్ష రుసుం చెల్లించాలని సూచించింది. ఇతర వివరాలకు రాష్ట్ర సాంకేతిక విద్యామండలి అధికార వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.



వేదికపై జడ్పీ చైర్మన్, సీఈవో, వైస్‌చైర్మన్

ఎన్ని సమావేశాల్లో చెప్పినా

సమస్యలు పరిష్కరించరా?

● అధికారుల తీరుపై జడ్పీటీసీల ధ్వజం ● జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశానికి రాకపోవడంపై ఆగ్రహం ● కోరం లేకుండానే మూడోస్థాయి సంఘ సమావేశం

చిత్తూరు రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రతి సమావేశంలో తాము సమస్యలు చెప్తున్నా అవి పరిష్కారం కావడం లేదని అధికారుల తీరుపై జడ్పీటీసీ సభ్యులు అసహనాన్ని వ్యక్తం చేశారు.చిత్తూరు జడ్పీ సమావేశ మందిరంలో గురువారం స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఉదయం 10.30గంటలకు ప్రారంభమైన సమావేశం మధ్యాహ్నం ఒంటిగంటకు ముగిసింది. సభ్యులు వారివారి మండలాల్లో నెలకొన్న సమస్యలపై అధికారులను నిలదీయడంతోనే సమావేశం ముగిసింది. కోరం లేకుండా మూడో స్థాయి సమావేశాన్ని నిర్వహించారనే విమర్శలు వచ్చాయి. వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు సమావేశానికి డుమ్మా కొట్టడంపై కూడా సభ్యులు చర్చించారు. ఏదో ఒక సాకు చెప్పి జిల్లా స్థాయి అధికారులు సమావేశాలకు రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై చర్యలు తీసుకోవాలని జడ్పీ చైర్మన్ శ్రీనివాసులును సభ్యులు కోరారు.జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, జడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి, 5వ స్థాయి సంఘ చైర్‌పర్సన్ భారతి తదితరులు పాల్గొన్నారు.


● గ్రామాల్లో విద్యుత్ అంతరాయం తీవ్రంగా ఉందంటూ ఎస్ఈ దృష్టికి సభ్యులు తీసుకొచ్చారు. ట్రాన్స్‌ఫార్మర్లకోసం రైతులు నెలల తరబడి వేచివుండాల్సి వస్తోందనగా ఈ సమస్యలను పరిష్కరిస్తామని ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ హామీ ఇచ్చారు.

● కొత్త పింఛన్లు ఇవ్వకపోవడంతో కిడ్నీ వ్యాధిగ్రస్తులు, బెడ్ రిడెన్, పెరాలసిస్ పేషెంట్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సదుం జడ్పీటీసీ సోమశేఖర రెడ్డి డీఆర్‌డీఏ అధికారులను నిలదీశారు. ఉపాధి హామీ పనులకు బిల్లులు ఇవ్వడంలో తీవ్ర జాప్యం జరుగుతోంద న్నారు.చిత్తూరు జిల్లాలో మార్చి 31వ తేది వరకు బిల్లులు అప్‌లోడ్ చేసే అవకాశం ఇస్తే తిరుపతి జిల్లాలో మాత్రం మార్చి 6వ తేదికే నిలిపివేశారని వాపోయారు.

● పీలేరులో యాభైకి పైగా ఆస్పత్రులుంటే కొత్తగా నిర్మించిన అశ్విని ఆస్పత్రిలోనే తనిఖీలు చేసి మూసివేశారంటూ వైద్య ఆరోగ్య శాఖ అధికారులపై జడ్పీటీసీ రత్నశేఖర్ ధ్వజమెత్తారు.దీంతో వెంటనే ఆస్పత్రిని తెరిపించాలని అధికారులకు జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు సూచించారు.

● ఆవులు, భూమి లేనోళ్లకు కూడా గోకులం షెడ్లు మంజూరు చేశారని ఎర్రావారిపాళ్యం జడ్పీటీసీ కరుణాకర రెడ్డి డ్వామా అధికారులను నిలదీశారు.

● పాలసముద్రం మండలంలో జగనన్న కాలనీ ఏర్పాటుకు ఖర్చు చేసిన డబ్బులు ఇంకా ఇవ్వకుండా హౌసింగ్ అధికారులు సతాయిస్తున్నారని జడ్పీటీసీ అన్నలగన్ వాపోయారు. ● వైద్య శాఖలో ఎన్‌హెచ్ఎం కింద విడుదల చేసిన నోటిఫికేషన్‌కు అనుమతి వుందా అని గుడుపల్లె జడ్పీటీసీ కృష్ణమూర్తి అడగ్గా కలెక్టర్ అనుమతితోనే నోటిఫికేషన్ ఇచ్చామని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చెప్పారు.



సమావేశానికి హాజరైన సభ్యులు, అధికారులు

టిప్పర్ ఢీకొని యువకుడి మృతి



మృతిచెందిన శేషగిరిరావు

చంద్రగిరి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లయ్యపల్లె సమీపంలో క్వారీ వద్ద టిప్పర్ ఢీకొని యువకుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. క్వారీలో అనంతపురం జిల్లాకు చెందిన శేషగిరిరావు(28) సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం అర్ధరాత్రి డీజిల్ కోసమని నడుచుకుంటూ వస్తుండగా క్వారీ నుంచి వెళుతున్న టిప్పర్ ఢీకొంది. శేషగిరిరావుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతన్ని తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నూతన అధికారులకు అభినందన



డీన్ సురేష్‌కుమార్‌ను సన్మానిస్తున్న టీచింగ్ అసోసియేషన్ నేతలు

తిరుపతిరూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో కొత్తగా బాధ్యతలు చేపట్టిన డీన్ ఆర్వీ సురేష్‌కుమార్, డీఎస్‌ఏ వి.వైకుంఠరావు, సీవోఈ కె.ఆదిలక్ష్మమ్మను వెటర్నరీ కళాశాల టీచింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం పలువురు ప్రొఫెసర్లు, అధ్యాపకులు మర్యాదపూర్వకంగా కలసి సన్మానించారు. సంఘ ప్రెసిడెంట్ డాక్టర్ బి.రాంబాబునాయక్ నేతృత్వంలో వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ వినోద్‌కుమార్, జనరల్ సెక్రటరీ లక్ష్మీకవిత, జాయింట్ సెక్రటరీ నవీన్‌కుమార్, సుష్మ, కుట్టికుమార్, సుధాకర్‌గౌడ్ హాజరై అభినందించారు.

అలరించిన దీపావళి కవి సమ్మేళనం



కవితా పఠనం చేస్తున్న విద్యార్థిని, వేదికపై ఆచార్య కొలకలూరి మధుజ్యోతి, ఆచార్య ఎస్టీడీ చంద్రశేఖర్, తోట వేంకటేశ్వర్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీలో నిర్వహించిన దీపావళి కవి సమ్మేళనం అలరించింది. తెలుగు విభాగం-ఈ తరం కవితా వేదిక సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. యుద్ధం - శాంతి అంశంపై కవి సమ్మేళనాన్ని చేపట్టారు. పలువురు విద్యార్థినులు, కవులు కవితా పఠనం చేశారు. కవితా పఠనం చేసిన వారికి పుస్తక బహుమతులు, ధృవీకరణ పత్రాలు అందజేసి అభినందించారు. ఈ తరం కవితా వేదిక అధ్యక్ష, కార్యదర్శి ఆచార్య ఎస్టీడీ చంద్రశేఖర్, తోట వేంకటేశ్వర్లు, తెలుగు విభాగాధిపతి ఆచార్య కొలకలూరి మధుజ్యోతి మాట్లాడుతూ కవిత్వం ప్రజల్లో చైతన్యం కల్గించిందని తెలిపారు. ఇందువల్ల ఈ తరం కవిత్వాన్ని చదువుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలుగు విభాగ అధ్యాపకులు డాక్టర్ వై.సుభాషిణి, డాక్టర్ డి.యువశ్రీ, పరిశోధకులు, విద్యార్థులు, కవులు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



షర్మిల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ ఈసీఈ విభాగ పరిశోధకురాలు ఎం.షర్మిల డాక్టరేట్ పొందారు. ఇంప్లిమెంటేషన్ ఆఫ్ ఆప్టిమైజేషన్ అల్గోరిథమ్స్ ఫర్ 5జీ కమ్యూనికేషన్ అంశంపై ఆమె పరిశోధన గ్రంథం సమర్పించారు. షర్మిల రూపొందించిన రెండు పరిశోధన వ్యాసాలు ప్రచురితమయ్యాయి. రెండు జాతీయ సదస్సుల్లోనూ పాల్గొని పరిశోధనా పత్రాలు సమర్పించారు. ఈ పరిశోధనకు ప్రొఫెసర్ ఆర్వీఎస్ సత్యనారాయణ పర్యవేక్షకులుగా వ్యవహరించినట్టు సీఈ రాజ మాణిక్యం తెలిపారు.

ముగిసిన ఆంగ్ల నైపుణ్య శిక్షణ



శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థినులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పద్మావతి యూనివర్సిటీ ఎంసీఏ ఫైనలియర్ విద్యార్థినులకు ఆంగ్ల నైపుణ్య శిక్షణ అందించారు. అమెరికాకు చెందిన అంజలా సూజన్ బకులా ఈ శిక్షణ అందించారు. ఆంగ్లంలో చదవడం, వినడం, మాట్లాడటం, రాయడం వంటి అంశాలను నేర్పారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ ప్రొఫెసర్ హరిపద్మరాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుమలలో అస్వస్థతకు గురైన వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

తిరుమల, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): తిరుమలలో అస్వస్థతకు గురైన గుర్తుతెలియని వ్యక్తి తిరుపతిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. టూటౌన్ పోలీసుల వివరాల మేరకు.. సుమారు 40 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి మంగళవారం తిరుమలలోని బాలాజీ బస్టాండ్‌లో ఎలాంటి కదలికలు లేకుండా ఉండటాన్ని గుర్తించిన స్థానికులు అశ్విని ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతిలోని రుయా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం అతను మృతి చెందాడు. మృతుడికి వద్ద ఎలాంటి ఆధారాలూ లేకపోవడంతో గుర్తుతెలియని మృతదేహంగా కేసు నమోదు చేశారు. ఆ వ్యక్తి కొన్ని రోజులుగా తిరుమలలో యాచకుడిగా ఉంటూ అనారోగ్యానికి గురైనట్టు పోలీసుల విచారణలో తేలింది. మృతుడి వివరాలు తెలిసిన వారు 9440796772కు తెలియజేయాలని పోలీసులు కోరారు.

అలిపిరి డిపోలో టైర్లు నిల్వ చేయడమా..?



అలిపిరి డిపోలో నిల్వ ఉంచిన టైర్లు

తిరుపతి(ఆర్టీసీ), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): అలిపిరి ఆర్టీసీ డిపో గ్యారేజీ ఆవరణలో ఎలక్ట్రిక్ బస్సులకు వినియోగించి పాడైన టైర్లను నిల్వ చేయడం విమర్శలకు తావిస్తోంది. ఆర్టీసీలో అద్దె రూపంలో వంద ఎలక్ట్రిక్ బస్సులను నిర్వహిస్తున్న రెండు యాజమాన్యాలు ఇక్కడ దాదాపు 500 టైర్లు నిల్వ చేశాయి. వాటికి అత్యంత సమీపంలో బస్సు రిపేర్లు, వెల్డింగ్స్ పనులు చేస్తున్నారు. సిబ్బంది తరచూ బీడీలు, సిగరెట్స్ కాలుస్తుంటారు. ఈ క్రమంలో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అదే జరిగితే పెద్దయెత్తున నష్టం వాటిల్లే అవకాశముంది. డిపో మేనేజర్ స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వేడుకగా ఊంజల్ సేవ



తిరుచానూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో గురువారం సాయంత్రం ఊంజల్‌సేవ వేడుకగా నిర్వహించారు. సుప్రభాత సేవతో అమ్మవారిని మేల్కొపి అర్చకులు నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని వాహన మండపానికి వేంచేపు చేసి ఊయలపై కొలువుదీర్చారు. సహస్ర దీపాలంకరణలో అమ్మవారు భక్తులను కటాక్షించారు. సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, చలపతి, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

కల్యాణ వెంకన్న పవిత్రోత్సవాలకు అంకురార్పణ



అంకురార్పణ నిర్వహిస్తున్న అర్చకులు

చంద్రగిరి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురం కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలకు గురువారం రాత్రి అంకురార్పణ చేశారు. శుక్రవారం నుంచి ఆదివారం వరకు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. రాత్రి 7 గంటలకు మృత్సంగ్రహణం, సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణ నిర్వహించారు. సంవత్సరం పొడవునా ఆలయంలో జరిగిన దోషాల నివారణకు పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. మొదటి రోజు శుక్రవారం పవిత్ర ప్రతిష్ఠ, రెండవ రోజు శనివారం మూలవర్లకు, ఉత్సవర్లకు, విమాన ప్రాకారానికి, ధ్వజస్తంభానికి, ఆంజనేయస్వామికి పవిత్ర సమర్పణ, చివరి రోజు ఆదివారం పూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగియనున్నాయి. పవిత్రోత్సవాల సందర్భంగా ఆలయంలో జరిగే ఆర్జిత కల్యాణోత్సవ సేవను రద్దు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో వీఆర్ వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు రాజ్‌కుమార్, రమేష్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునికుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, అర్చకులు పాల్గొన్నారు.

వేమూరు ప్రకృతి వ్యవసాయక్షేత్రం సందర్శన



కషాయాల తయారీపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

తిరుపతిరూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం వేమూరు గ్రామంలోని అయ్యప్పనాయుడు ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని గురువారం రాయలసీమ రీజియన్ బయో ఇన్పుట్ రిసోర్స్‌సెంటర్(బీఆర్సీ)యజమానులు సందర్శించారు. నేషనల్ మిషన్ ఆఫ్ నేచురల్ ఫామింగ్, ఏపీ రైతు సాధికారిక సంస్థ ఆధ్వర్యంలో రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, నంద్యాల, కర్నూలు జిల్లాలకు చెందిన బీఆర్సీ యజమానులకు శిక్షణ ఇస్తున్నారు. గురువారం పలువురు యజమానులు వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. ఏటీఎం మోడల్‌లో విత్తనాలు, నారు నాటడం, సహజ సాగులో పట్టుపురుగుల పెంపకం, మామిడిలో అవలంబిస్తున్న రింగ్ ట్రెన్సెస్, బౌండరీ ట్రెంచెస్, జీరో టిలేజ్, ఫారమ్‌పాండ్‌పై అవగాహన కల్పించారు. చెరకు సాగులో విత్తనం, కూలీలు, ఖర్చు తగ్గించుకునే విధానాలను వివరించారు. ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ అడిషనల్ డీపీఎం పట్టాభిరెడ్డి మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో ఇన్పుట్ తయారీ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్న ఉద్దేశంతో కేంద్రప్రభుత్వం బీఆర్సీ కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని తెలిపారు.

చెరువులను సుందరంగా తీర్చిదిద్దుతాం



చెరువును పరిశీలిస్తున్న దివాకర్‌రెడ్డి, పక్కనే అరుణ్‌కృష్ణమూర్తి

తిరుపతి రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తిరుపతి పరిసరాల్లోని చెరువులను పునరుద్ధరించి వాటిని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి పేర్కొన్నారు. చెన్నైకి చెందిన ఎన్విరాన్‌మెంటల్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపకుడు అరుణ్ కృష్ణమూర్తితో కలసి గురువారం రూరల్ మండలంలోని అవిలాల చెరువును సందర్శించారు. చెరువులో నీటి నిల్వ సామర్థ్యం, ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో విధానాలపై చర్చించారు. చెరువుకు నీరుచేరే సప్లైచానల్స్, జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను అధికారులు వివరించారు. దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. 19 రాష్ట్రాల్లో 657 చెరువులను అభివృద్ధి చేయడంలో అరుణ్‌కృష్ణమూర్తి విశేష కృషి చేశారని, ఆయన అనుభవాలను పరిగణనలోకి తీసుకుని డ్రోన్ సర్వే చేపడుతున్నా మని అన్నారు. తుడా కార్యదర్శి ఎన్వీ శ్రీకాంత్‌బాబు మాట్లాడుతూ కలెక్టర్ నేతృత్వంలో 20 చెరువులను గుర్తించామని, వీటి అభివృద్ధికి రూ.82కోట్ల అంచనాతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారని అన్నారు. తిరుపతిలో భూగర్భజలాల పెంపు, పర్యాటకరంగ అభివృద్ధికి కృషి జరుగుతోందన్నారు. స్వర్ణ నారావారిపల్లె కన్సల్టెంట్ వెంకట్, ఉద్యానవన అధికారిణి మాలతి, తుడా ఇంజనీర్ మురళీమోహన్ పాల్గొన్నారు.

రామచంద్రాపురంలో కుండపోత వాన





భవానీజలకంఠేశ్వరాలయం ముందు ప్రవహిస్తున్న వర్షపు నీరు - సంజీవరాయపర్వతం నుంచి జాలువారుతున్న వర్షపు నీరు

రామచంద్రాపురం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలచెరువుకట్ట ప్రాంతంలో సోమవారం సాయంత్రం కుండపోత వాన కురిసింది. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమైన వర్షం గంటన్నరపాటు ఏకధాటిగా కురవడంతో పొలాల్లో నీరు నిలిచింది. తిరిగి ఏడు గంటలకు ప్రారంభమై కురుస్తూనే ఉంది. సంజీవరాయ పర్వతం నుంచి వర్షపునీరు జాలువారడంతో ఆహ్లాదకర వాతావరణం ఏర్పడింది. ప్రయాణికులు రెండుగంటల పాటు ఎక్కడికక్కడ ఆగిపోయారు. చాలా రోజుల తర్వాత మండలంలో భారీ వర్షం కురిసింది. చెరుకు తోటలకు మేలుచేకూరిందని రైతులు అంటున్నారు.

చెరువు మొరవ నీటి కాలువ పునరుద్ధరణ



కాలువ పునరుద్ధరణ పనులు ప్రారంభిస్తున్న శివకుమార్

భాకరాపేట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలం తిప్పిరెడ్డిగారిపల్లె వద్దనున్న ఎద్దుల చెరువు నుంచి చిన్నగొట్టిగల్లు చెరువుకు ఉన్న కాలువ పునరుద్ధరణ పనులను టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జ్ శివకుమార్ గురువారం ప్రారంభించారు. గతంలో ఉన్న కాలువ జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా పోయింది. ఎద్దుల చెరువు మొరవ నీరు చిన్నగొట్టిగల్లు చెరువుకు రావడానికి కాలువ లేకుండా పోయింది. దీంతో రోడ్డుకు అవతలివైపు కాలువ నిర్మించాలంటే అక్కడ పొలాలున్న రైతులకు ఇబ్బంది కలుగుతుంది. దీంతో పాత రోడ్డు, కొత్తగా నిర్మించిన రోడ్డుకు మధ్య ఖాళీ స్థలంలో కాలువ నిర్మాణాన్ని చేపట్టారు. ప్రస్తుతం ఎద్దుల చెరువు పూర్తిస్థాయిలో నిండి కాలువలో నీరు వస్తోంది. స్థానికంగా ఉన్న పురోహితులు వాసుదేవశర్మ కాలువ నిర్మాణ విషయమై నాయకుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు అంగీకరించి కాలువ పునరుద్ధరణ పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చంద్రశేఖర్, బెల్లంకొండ రమణ, శ్రీనివాసులు, రఫీ, చోటాసాహెబ్, నాగరాజ, వెంకటేశ్, మురళి తదితరులు పాల్గొన్నారు.

చెంగాళమ్మ హుండీ ఆదాయం రూ.59.79 లక్షలు

సూళ్లూరుపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ హుండీ ఆదాయాన్ని గురువారం దేవదాయశాఖ ఆధ్వర్యంలో లెక్కింపు చేపట్టారు. మొత్తం 102 రోజులకుగాను అమ్మవారికి కానుకల రూపంలో 59,79,520 ఆదాయం వచ్చినట్లు సహాయ కమిషన్ ప్రసన్న లక్ష్మి తెలిపారు. ఇవి కాకుండా బంగారం 0.48 గ్రాములు, వెండి 0.69 గ్రాములు, విదేశీ కరెన్సీ యుఎస్ఏ డాలర్స్ 185, సింగపూర్ డాలర్ 15, యుఏఈ దీరామ్స్ 30, సౌదీ రియాల్స్ 15, నేపాల్ రూపాయి 10 హుండీ కానుకల రూపంలో ఆదాయం చేకూరింది. గూడూరు దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ బాబ, సహాయ కమిషనర్ ప్రసన్న లక్ష్మి పర్యవేక్షణలో లెక్కింపు జరిగింది.

శాస్త్రోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు



శ్రీకాళహస్తి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మేథో గురుదక్షిణామూర్తికి గురువారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. కలశ ప్రతిష్ఠ అనంతరం వినాయక పూజల కలశ పూజ వైదిక కృతువులు నిర్వహించారు. స్వామివారికి వైభవంగా అభిషేకం నిర్వహించారు. విశేషంగా అలంకరించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు.

ముక్కంటి సేవలో మాజీ మంత్రి కన్నా



శ్రీకాళహస్తి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని గురువారం మాజీ మంత్రి, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆశీర్వదించారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి ఆర్డీవోకు అదనపు బాధ్యతలు

గూడూరు అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గూడూరు డివిజన్ ఇన్‌చార్జి ఆర్డీవోగా శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ సబ్‌కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న రాఘవేంద్రమీనా బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో భానుప్రకాష్ రెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగించారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

పుత్తూరు అర్బన్, అక్టోబర్ 16(ఆంధ్రజ్యోతి): కేబీఆర్ పురంలో ఉంటున్న తన చెల్లెలు దీప(17) కనిపించడం లేదని ఆమె సోదరి సోనూ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.. వెంకటగిరికి చెందిన సోను వివాహం అనంతరం భర్తతో పాటు పుత్తూరు కేబీఆర్ పురంలో ఉంటున్నారు. ఇంటర్‌తో చదువు నిలిపేసిన దీప అక్క దగ్గర ఉండేది. ఈ క్రమంలో ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదని ఫిర్యాదులో పేర్కొంది.

తృటిలో తప్పిన ప్రమాదం

పుత్తూరు అర్బన్, అక్టోబర్ 16(ఆంధ్రజ్యోతి): పిల్లారపట్టు కూడలిలో గురువారం ఓ లారీ బోల్తా పడింది. నిత్యం రద్దీగా ఉండే ఈ కూడలిలో డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో లారీ పక్కకు పడిపోయింది. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. ప్రమాదానికి కారణాలను పోలీసులు చేరుకుని ఆరా తీస్తున్నారు.

సాగరమాల పనుల పరిశీలన

కోట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : కోట మండలం కొత్తపట్నం పంచాయతీలోని సాగరమాల ప్యాకేజీ-4 రోడ్డు పనులను గురువారం కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ పరిశీలించారు. నాయుడుపేట, కృష్ణపట్నం పోర్టుకు వెళ్లే సాగరమాల ప్యాకేజీ-4 రోడ్డు పనులు 31 కిలోమీటర్ల వరకు జరుగుతున్నాయి. రూ.1200 కోట్ల వ్యయంతో చేపట్టిన పనుల నాణ్యతను స్వయంగా పరిశీలించారు. అక్కడ నుంచి నేరుగా కనుపూరు మీదుగా కోటకు చేరుకొని అక్కడ నుంచి గూడూరు వైపు వెళ్లారు. ఆయన వెంట గూడూరు ఇన్‌చార్జి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, తహసీల్దారు జయజయరావు, సర్వేయర్ గోపీరెడ్డి, ఆర్ఐ ప్రసాద్, వీఆర్వో శ్రీనివాసులు, సాగరమాల రోడ్డు ఇంజనీర్లు ఉన్నారు.

టీపీవోకు ఏసీపీగా పదోన్నతి

● అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ

పుత్తూరు అర్బన్, అక్టోబర్ 16(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపాలిటీలోని పట్టణ ప్రణాళిక విభాగం అధికారి ఎం.నీరజాక్షికి అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా పదోన్నతి లభించింది. ఈ మేరకు రాష్ట్ర పట్టణ ప్రణాళిక విభాగం డైరెక్టర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె ఏసీపీగా పదోన్నతితో అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ అయ్యారు. దీపావళి తరువాత విధుల్లో చేరనున్నట్లు ఆమె వివరించారు. నగరి పట్టణ ప్రణాళిక విభాగం అధికారి జాకీరా కాతూన్‌కు ఏసీపీగా పదోన్నతిపై. గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ అయ్యారు.

మహాసభను జయప్రదం చేయండి

తిరుపతి అర్బన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): గుంటూరులో ఈనెల 19వ తేదీన నిర్వహించనున్న బీసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ద్వితీయ మహాసభకు జిల్లా నుంచి వెనుకబడి కులాల ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని బీసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వంకీపురం పవన్ కోరారు. మేమెంతో మాకంత-మనకోసం మనసభ పేరుతో నిర్వహిస్తున్న ఈ సభ ద్వారా ఐక్యత చాటాలని పేర్కొన్నారు.

వర్షాకాలం బురద.. ఎండాకాలం దుమ్ము

● అభివృద్ధికి నోచని కొత్త నెన్నూరు రోడ్డు



వర్షాకాలంలో బురదమయమైన రోడ్డు



ఎండాకాలంలో రోడ్డుపై చేరిన దుమ్ము

రామచంద్రాపురం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం గుంతల్లో నీరు నిలిచి బురద.. ఎండాకాలం దుమ్ముతో వాహనదారుల అవస్థలు.. ఇది ఎక్కడో మారుమూల అటవీ ప్రాంతంలో కాదు.. మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న కొత్తనెన్నూరు రోడ్డు పరిస్థితి ఇది. నెన్నూరు క్రాస్ నుంచి కొత్త నెన్నూరు మీదుగా కొత్తకండ్రిగ వరకు 2011లో ప్రత్యేక నిధులతో రెండు కిలోమీటర్ల దూరం లింకురోడ్డు ఏర్పాటు చేశారు. దీంతో కొత్త నెన్నూరు, శాఖమూరికండ్రిగ, కన్నికాపురం, కొత్తకండ్రిగతోపాటు ఆరు గ్రామాల ప్రజలకు బస్సు సౌకర్యం ఏర్పడింది. సరుకుల రవాణాకు మార్గం సులభమైంది. వైసీపీ హయాంలో కొత్త నెన్నూరు మీదుగా చెంచులక్ష్మీకాలనీ అటవీ ప్రాంతంలో గ్రావెల్ తరలించడానికి క్వారీకి అనుమతి ఇవ్వడంతో నిత్యం టిప్పర్లు తిరిగాయి. దీంతో కిలోమీటరు దూరం పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఎమ్మెల్యే నాని బాధ్యతలు చేపట్టిన తర్వాత గుంతలు పూడ్చినా కొన్నాళ్లకు యథాస్థితికి వచ్చింది. వర్షాకాలం గుంతల్లో నీరు నిలిచి ఎక్కడ గుంత ఉందో తెలియక వాహన చోదకులు అదుపు తప్పే పరిస్థితి ఏర్పడుతోంది. ఎండాకాలం ఈ రోడ్డుపై నాలుగుచక్రాల వాహనం వెళితే దాని వెనుక వెళ్లాలంటే దుమ్ముకు ఊపిరి ఆడని పరిస్థితి. 15ఏళ్లుగా రోడ్డుకు సంబంధించి అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకున్న దాఖలాలు లేవు. ఇకనైనా అధికారులు స్పందించి రోడ్డును బాగుచేయాలని ప్రజలు కోరుతున్నారు.

చిన్నపాటి వర్షానికే బురదమయంగా రోడ్లు




కరకంబాడి ప్రధాన రహదారిలో రోడ్లపై ప్రవహిస్తున్న మురుగునీరు

తిరుపతి అర్బన్/తిరుపతి(జీవకోన), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): నగరంలో గురువారం ఉదయం కురిసిన కొద్దిపాటి వర్షానికే డ్రైనేజీ నీరు పొంగి ప్రవహించింది. రోడ్లపైకి మురుగునీరు చేరి బురదమయంగా మారాయి. వాహనదారులకు, పాదచారులకు ఇబ్బందిగా మారింది. సైడు కాలువల్లో పూడిక, మలుపుల్లో ఏర్పాటుచేసిన తూములను శుభ్రం చేయకపోవడం వల్లే ఈ పరిస్థితి ఉంటోందని నగరవాసులు అభిప్రాయపడుతున్నారు. పైగా మురుగునీరు రోజుల తరబడి నిల్వ ఉండటంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. ఇళ్లమధ్య ఖాళీస్థలాల్లోనూ నీరునిల్వ ఉంటోంది. ఇందిరా ప్రియదర్శిని మార్కెట్ బురదతో కూరుకుపోవడంతో కొనుగోలుదారులు, వ్యాపారులకు ఇబ్బంది తప్పలేదు. తిరుపతి-కరకంబాడి మార్గంలోని లెప్రసీ ఆస్పత్రి ముందున్న ప్రధాన రోడ్డు మురుగునీటితో నిండిపోయింది. కాలువలో నీరు పోకపోవడంతో రోడ్లపైకి వచ్చాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దుర్వాసన భరించలేక ముక్కులు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. సంబంధిత శాఖ అధికారులు స్పందించి కాలువల్లో చెత్తను తొలగించాలని కోరుతున్నారు.

శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



ధ్వజస్తంభం వద్ద నీటితో శుద్ధి చేస్తున్న ఆలయాధికారులు

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : గోవిందరాజస్వామి ఆలయంలో గురువారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈనెల 20వ తేదీన దీపావళి ఆస్థానం సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టారు. స్వామివారిని ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవతో మేల్కొలిపి తోమాల సేవ, సహస్రనామార్చన, నివేదన, శాత్తుమొర నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పులు, పూజాసామగ్రిని నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి, పసుపు, పచ్చాకు, గడ్డకర్పూరం, గంధంపొడి, కుంకుమ, కిచిలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాల మిశ్రమంతో లేపనం వేసి, శుద్ధి చేశారు. 9.30 గంటల నుంచి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో వీఆర్‌శాంతి, ఏఈవో ఏబీ నారాయణ చౌదరి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీల సంక్షేమానికి కృషి



మీడియాతో మాట్లాడుతున్న జబ్బల శ్రీనివాసులు

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) : బీసీల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని సౌతిండియా ఓబీసీ చైర్మన్ జబ్బల శ్రీనివాసులు తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ ఈనెల 12వ తేదీన విజయవాడలో జరిగిన సౌతిండియా ఓబీసీ సెమినార్‌లో తనను అధ్యక్షుడిగా నియమించిన ఎంపీలు ఆర్.కృష్ణయ్య, బీద మస్తాన్‌రావు, పాక సత్యనారాయణ, మాజీ ఎంపీ సాగర్‌నాయక్, మాజీ డిప్యూటీ సీఎం చంద్రకాంత్ కవలేకర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ బీసీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. పక్క రాష్ట్రాల తరహాలో ఏపీలోనూ బీసీలకు సమన్యాయం జరిగేలా పోరాటం చేస్తామన్నారు.

శాప్ చైర్మన్‌కు సన్మానం



రవినాయుడిని సన్మానిస్తున్న శాప్ కోచ్‌లు, సబ్‌స్టాఫ్

తిరుపతి(క్రీడలు), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ అధ్యక్షుడు అనిమిని రవినాయుడిని కోచ్‌లు, సబ్‌స్టాఫ్ గురువారం సన్మానించారు. వారికి గత ఏడాది జూలై నుంచి జీతాలు రాలేదు. సమస్యను రవినాయుడు దృష్టికి తీసుకెళ్లగా పెండింగ్ జీతాలు జమయ్యేలా చర్యలు తీసుకున్నారు. తమ సమస్యను పరిష్కరించినందుకు వారు గురువారం మధ్యాహ్నం శ్రీనివాస క్రీడా సముదాయంలో శాలువకప్పి సన్మానించారు. డీఎస్‌డీవో శశిధర్ పాల్గొన్నారు.

ఓవరాల్ చాంపియన్‌గా శ్రీపద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలల జట్టు



తిరుపతి(క్రీడలు), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ అంతర్ కళాశాలల క్రీడా పోటీలలో శ్రీపద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలల జట్టు ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. బాస్కెట్‌బాల్, ఖోఖో, టేబుల్‌టెన్నిస్, టెన్నికాయిట్ పోటీలలో విజయం సాధించగా బాల్ బ్యాడ్మింటన్, కబడ్డీ, చెస్ పోటీలలో రన్నరప్‌గా నిలిచింది. గురువారం కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నారాయణమ్మ క్రీడాకారులను అభినందించారు. ఆమె మాట్లాడుతూ క్రీడలతో పోటీ తత్వం, నాయకత్వ లక్షణాలు అలవడుతాయన్నారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ భారతి మాట్లాడుతూ గెలుపోటములను సమభావనతో చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సైకాలజీ విభాగాధిపతి భద్రమణి, భువనేశ్వరిదేవి, పద్మశ్రీ పాల్గొన్నారు.

జూడో క్రీడా పోటీలకు శ్రీరామ విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ జయచంద్ర, అధ్యాపకులు

తిరుపతి రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కరకంబాడి రోడ్డులోని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించే యూనివర్సిటీ స్థాయి జూడో క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జయచంద్ర పేర్కొన్నారు. వర్సిటీ పరిధిలోని పలు ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులకు జేఎన్‌టీయూ స్పోర్ట్స్ కౌన్సిల్ నిర్వహించిన పోటీలలో తమ విద్యార్థులు రాణించి ఎంపికయ్యారన్నారు. ప్రతిభచాటిన విద్యార్థులను కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి, సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డి, డైరెక్టర్ మన్నెం అరవింద్ కుమార్‌రెడ్డి అభినందించారు. ఫిజికల్ డైరెక్టర్ పి.వినోద్‌కుమార్, కె.లక్ష్మీసౌజన్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

జాతీయ గోల్‌షాట్ బాల్ పోటీలకు రెడ్‌చెర్రీస్ విద్యార్థి



తమన్‌ను అభినందిస్తున్న డైరెక్టర్ సునీల్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్

తిరుపతి(విద్య), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రెడ్‌చెర్రీస్ పాఠశాల విద్యార్థి కె. తమన్ జాతీయ స్థాయి గోల్‌షాట్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి కప్, మెమెంటో, ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. తమన్‌ను పాఠశాల డైరెక్టర్ సునీల్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

ఘనంగా ఆయుధపూజ



శ్రీవారి నమూనా విగ్రహానికి ప్రత్యేక పూజలు చేస్తున్న అధికారులు

తిరుమల, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): టీటీడీ రవాణా విభాగం ఆధ్వర్యంలో గురువారం ఆయుధపూజ ఘనంగా నిర్వహించారు. తిరుపతిలోని వర్క్‌షాప్‌లో ఉదయం, సాయంత్రం తిరుమల డిపోలో నిర్వహించారు. ట్రాన్స్‌పోర్టు జీఎం శేషారెడ్డి, డీఎం లక్ష్మీప్రసన్న, డీఐలు, డ్రైవర్లు, సిబ్బంది పాల్గొన్నారు. టీటీడీ రవాణా విభాగంలోని వాహనాలకు పుష్పాలంకరణ చేసి, తోరణాలు కట్టి ఆయుధపూజ నిర్వహించారు. శ్రీవారి నమూనా విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి, ప్రసాదాలు పంపిణీ చేశారు.

అబాకస్‌లో ఆలిండియా రికార్డు



రిత్విక్‌రెడ్డిని అభినందిస్తున్న విద్యాసంస్థల డైరెక్టర్, ప్రిన్సిపాల్

తిరుపతి(విద్య), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): శ్రీగీతాంజలి గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌కు చెందిన బ్లూబెల్స్ స్కూల్ విద్యార్థి వై.రిత్విక్‌రెడ్డి ఆలిండియా అబాకస్ రికార్డును నెలకొల్పాడు. మాస్టర్ మైండ్ అబాకస్ అకాడమీ ఆధ్వర్యంలో ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర స్థాయి పోటీల్లో ఈ రికార్డును సాధించాడు. జూనియర్ లెవెల్ పోటీల్లో కేవలం రెండు నిమిషాల్లో 60 అబాకస్ సమస్యలను పరిష్కరించి మొదటి స్థానాన్ని దక్కించుకున్నాడు. గురువారం తిరుపతిలోని పాఠశాలలో విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ నెల్లూరి మాధవి, ప్రిన్సిపాల్ వి.దీప అతన్ని అభినందించారు.

నిబంధనల మేరకే బాణసంచా విక్రయాలు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ భక్తవత్సలం

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను పురస్కరించుకుని నిబంధనల మేరకు బాణసంచా విక్రయాలు జరపాలని తిరుపతి డీఎస్పీ భక్తవత్సలం కోరారు. నగరంలోని బాణసంచా విక్రయదారులతో ఆయన గురువారం సమావేశమయ్యారు. దుకాణాల వద్ద ఇసుక సంచులను, అగ్నిమాపక యంత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని కోరారు. పిల్లలు దుకాణం వద్దకు రాకుండా చూడాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గడువు వరకు, ఎమ్మార్పీకే విక్రయించాలని సూచించారు. ఈ సమావేశంలో ఈస్ట్, వెస్ట్, యూనివర్సిటీ స్టేషన్ల సీఐలు శ్రీనివాసులు, మురళీమోహన్, రామయ్య, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

అనస్థీషియా వైద్యుల పాత్ర కీలకం



వైద్యులను సన్మానిస్తున్న ఆస్పత్రి సిబ్బంది

తిరుపతి(వైద్యం), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): వైద్యరంగంలో అనస్థీషియా వైద్యుల పాత్ర ఎంతో కీలకమని శ్రీరమాదేవి సూపర్ స్పెషాలిటీ ఎండీ డాక్టర్ డీబీ శశిధర్‌రెడ్డి అన్నారు. ప్రపంచ అనస్థీషియా దినోత్సవం సందర్భంగా గురువారం శ్రీరమాదేవి ఆస్పత్రిలోని అనస్థీషియా వైద్యులు కిశోర్, ప్రశాంత్, ప్రసాద్‌లను ఆస్పత్రిలోని సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ రోగికి శస్త్ర చికిత్స చేయాలంటే అనస్థీషియా చాలా ముఖ్యమైందన్నారు. అనస్థీషియా వైద్యులు ఇచ్చే మత్తుపై ఆధారపడే సర్జరీలు చేయాల్సి ఉంటుందని తెలిపారు.

తిరుపతి ఎమ్మెల్యే కావడం అదృష్టం

ఆరణికి ప్రధాని మోదీ అభినందన



ప్రధానికి వీడ్కోలు పలుకుతున్న ఎమ్మెల్యే ఆరణి

తిరుపతి అర్బన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): తిరుపతి లాంటి పుణ్యక్షేత్రంలో ఎమ్మెల్యే కావడం అదృష్టమని ఆరణి శ్రీనివాసులును ప్రధాని మోదీ అభినందించారు. కర్నూలు జిల్లాలో గురువారం జరిగిన పర్యటనలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. పర్యటన ముగిసిన తర్వాత హెలిప్యాడ్ వద్ద ప్రధానిని మర్యాదపూర్వకంగా కలిశారు. పక్కనే ఉన్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ బాలాజీ టెంపుల్.. తిరుపతి ఎమ్మెల్యే అంటూ పరిచయం చేశారు. 'వెరీగుడ్.. పుణ్యక్షేత్రంలో ఎమ్మెల్యే అవడం అదృష్టం చేసుకున్నావ్' అంటూ హిందీలో అభినందించారు.

శ్రీనగర్ కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు అభివృద్ధి చేయండి



కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న డాక్టర్ కోడూరు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని రాయల్‌నగర్ వద్దనున్న శ్రీనగర్ కాలనీలో రోడ్లు, మురికినీటి కాలువలను అభివృద్ధి చేయాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కోడూరు బాలసుబ్రహ్మణ్యం కోరారు. ఈ మేరకు గురువారం మున్సిపల్ కమిషనర్ మౌర్యను కలసి వినతిపత్రం అందచేశారు. కాలనీలో సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేనందున మురికి నీరు రోడ్లపై వస్తోందని అన్నారు. తిరుపతిలో ఈట్ స్ట్రీట్ ఏర్పాటు చేయాలని కోరారు. కొర్లగుంట ప్రాంతంలో వరద నీటితో రహదారులు నీటి మయమవుతున్నాయన్నారు. పరిశీలించి పరిష్కరిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి పెరుమాళ్ మధు, ప్రమోద్ పాల్గొన్నారు.

హంద్రీ-నీవా కాలువలో తేలిన మృతదేహం



శ్రీకాంత్ మృతదేహం

పుంగనూరు రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలం బోడేవారిపల్లె పంచాయతీ యాతాలవంక సమీపంలోని హంద్రీ-నీవా కాలువలో మదనపల్లె వాసి మృతదేహం తేలింది. గురువారం మృతదేహం కుళ్లి దుర్వాసన రావడంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పుంగనూరు ఏఎస్‌ఐ అశ్వర్థనారాయణ సంఘటనా స్థలానికి చేరుకుని కుళ్లిన మృతదేహాన్ని బయటకు తీసి పరిశీలించారు. 15 రోజుల క్రితం హంద్రీ-నీవా కాలువలో పడినట్లు గుర్తించి అన్నమయ్య జిల్లా మదనపల్లె పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మదనపల్లె వన్ టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చారు. మృతదేహాన్ని పరిశీలించి మదనపల్లెలో భరత్ మెడికల్ షాపు దుకాణ యజమాని శ్రీకాంత్‌గా గుర్తించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏఎస్‌ఐ మాట్లాడుతూ శ్రీకాంత్ 15 రోజుల క్రితం తాను చనిపోతున్నట్లు అమెరికా, బెంగళూరులో ఉన్న కుమారులకు ఫోన్ మెసేజ్ పెట్టి ద్విచక్రవాహనంలో మదనపల్లెకి కొంతదూరంలోని హంద్రీ-కాలువ పక్కన వాహనంతో పాటు తన వస్తువులు పెట్టినట్లు మదనపల్లె పోలీసులు తెలిపారు. దీంతో మదనపల్లె వన్‌టౌన్ పోలీసులు శ్రీకాంత్ అదృశ్యమైనట్లు కేసు నమోదు చేయగా.. శవం లభ్యం కావడంతో మృతదేహాన్ని మదనపల్లె పోలీసులకు అప్పగించినట్లు పుంగనూరు సీఐ తెలిపారు.

వైకుంఠ ద్వార దర్శనం

రెండు రోజులే కల్పించండి

టీటీడీ ఈవోకు శ్రీనివాసానంద సరస్వతి వినతి



తిరుపతి(కల్చరల్), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని వైకుంఠ ద్వార దర్శనాన్ని రెండు రోజులే కల్పించాలని టీటీడీ ఈవో అనీల్‌కుమార్ సింఘాల్‌కు ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి విన్నవించారు. ఆ మేరకు గురువారం ఆయన వినతిపత్రం సమర్పించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పది రోజులపాటు వైకుంఠ ద్వార దర్శనం కల్పించారని గుర్తుచేశారు. కేవలం ధనార్జనను దృష్టిలో ఉంచుకుని ఈ నూతన విధానానికి నాడు శ్రీకారం చుట్టారని ఆరోపించారు. పూర్వపు ఆచారాల ప్రకారం రెండు రోజులు మాత్రమే వైకుంఠ ద్వార దర్శనం కల్పించాలన్నారు.

కళ్యాణరేవుల జలపాతంలో యువకుడి గల్లంతు



గల్లంతైన యూనిస్

పలమనేరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పలమనేరు సమీపంలోని కళ్యాణరేవుల జలపాతంలో యూనిస్ (25) అనే యువకుడు గల్లంతయ్యాడు. గురువారం స్నేహితులతో కలిసి జలపాతం వద్దకు వెళ్లిన యూనిస్ ప్రమాదవశాత్తు జలపాతంలో పడిపోయాడు. పలమనేరు అగ్నిమాపక సిబ్బంది జలపాతం వద్దకు చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు. అయితే అప్పటికే వర్షం ప్రారంభం కావడంతో పాటు చీకటి పడుతుండటంతో గాలింపు చర్యలు ముందుకు సాగలేదు. ఇటీవల కురిసిన వర్షాలకు కౌండిన్యనది ఉధృతంగా ప్రవహిస్తోంది. నది ప్రవాహం కళ్యాణరేవుల జలపాతం మీదుగా తమిళనాడులోని మోర్ధాన ప్రాజెక్టుకు చేరుతుంది. నదీ ప్రవాహం ఉధృతంగా ఉన్నందున మృతదేహం మోర్దాన ప్రాజెక్టుకు చేరే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు చెబుతున్నారు.

మేయర్ దంపతుల హత్యకేసు 24కు వాయిదా

చిత్తూరు లీగల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దివంగత మేయర్ దంపతుల హత్య కేసు ఈనెల 24వ తేదీకి వాయిదా పడింది. 2016 నవంబరు 17న నగరపాలక కార్యాలయంలో కఠారి అనురాధ, మోహన్ దంపతులు హత్యకు గురయ్యారు. ఈ ఘటనపై చిత్తూరు వన్ టౌన్ పోలీసులు చింటూతోపాటు మరికొంత మందిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించారు. ఈ కేసు గురువారం తొమ్మిదో అదనపు జిల్లా కోర్టులో వాయిదాకు రాగా, న్యాయమూర్తి శ్రీనివాసరావు ఈ కేసును ఈనెల 24వ తేదీకి వాయిదా వేశారు.

వృద్ధురాలి మెడలో చైన్ చోరీ

తిరుపతి (నేరవిభాగం), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వృద్ధురాలి మెడలో చైన్ చోరీ చేసిన ఘటన గురువారం నగరంలోని బెస్తవీధిలో చోటు చేసుకుంది. వెస్ట్ సీఐ మురళీమోహన్ వివరాల మేరకు.. బెస్తవీధికి చెందిన మనోహరమ్మ చెల్లెలు మనవడు అఖిల్‌ను రెండేళ్ల క్రితం కొందరు హత్య చేశారు. తాజాగా నిందితుడు తాను అఖిల్ స్నేహితుడినని చెప్పి ఇంటి వద్ద ఉన్న మనోహరమ్మ వద్దకు వచ్చి మెడలో ఉన్న 16 గ్రాముల బంగారు చైను లాక్కుని పారిపోయాడు. ఆమె గట్టిగా చైన్‌ను పట్టుకోవడంతో నవరం బంగారు ఉండిపోయింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫ్లెక్సీ చించిన ఘటనలో ఇద్దరి అరెస్టు

తిరుపతి (నేరవిభాగం) అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోలున్న ఫ్లెక్సీ చించిన ఘటనలో ఇద్దరు యువకులపై గురువారం కేసు నమోదైంది. తిరుపతి ఈస్ట్ సీఐ శ్రీనివాసులు కథనం మేరకు.. సాయినగర్‌లో కాపురమున్న సాయికుమార్ జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శిగా పని చేస్తున్నారు. దీపావళి పండుగ సందర్భంగా నాయకుల ఫొటోలతో ఉన్న ఫ్లెక్సీని ఆయన ఏర్పాటు చేశారు. అదే ప్రాంతానికి చెందిన దినేష్, పప్పు ఈ ఫ్లెక్సీని చించేశారు. సాయికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ చెప్పారు.

కారు షెడ్డులో దొంగలు పడ్డారు

పలమనేరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు-కుప్పం మార్గంలోని కొలమాసన పల్లె వద్ద బుధవారం అర్ధరాత్రి విజయ్ అనే వ్యక్తికి చెందిన కారు షెడ్డులో దొంగలు పడ్డారు. గురువారం ఉదయం గ్యారేజి వద్దకు రాగానే దొంగలు పడినట్లు గుర్తించారు. విలువైన ఇంజన్ సామాన్లు, కారు ఇంజన్లకు వినియోగించే ఆయిల్, విలువైన స్పేర్ పార్ట్స్ చోరీ చేసుకెళ్లినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు.

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



కార్మిక శాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నేతలు

తిరుపతి (ఆటోనగర్), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక రుయా ఆసుపత్రిలో ఇటీవల తొలగించిన 50 మంది కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.జయచంద్ర, టి.సుబ్రమణ్యం డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఉప కార్మిక శాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ 20 ఏళ్లుగా రుయా ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికులను నూతనంగా కాంట్రాక్టు తీసుకున్న వారు తొలగించడం భావ్యం కాదన్నారు. వారం రోజులుగా కార్మికులు ఆసుపత్రి ప్రాంగణంలో నిరసన తెలుపుతున్నా అధికారులు జోక్యం చేసుకోక పోవడం అన్యాయమన్నారు. కార్మిక శాఖ అధికారులు జోక్యం చేసుకుని వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేణుగోపాల్, బుజ్జి, చినబాబు, జి.బాలసుబ్రమణ్యం, లక్ష్మమ్మ, బి.రాణి, పి.రామమూర్తి, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్‌గా గాలి పుష్పలత



తిరుపతి(విద్య), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్‌గా బీజేపీ సీనియర్ నాయకురాలు తిరుపతికి చెందిన డాక్టర్ గాలి పుష్పలత నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. తనపై నమ్మకముంచి రాష్ట్ర మీడియా పానలిస్ట్‌గా బాధ్యతలు అప్పగించినందుకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌కు, తన నియామకం కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి పాటుపడతానని చెప్పారు.



'కే-ర్యాంప్' పద్ధతైన సినిమా

తిరుమల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): 'కే-ర్యాంప్' చాలా పద్ధతైన సినిమా అని, ఫ్యామిలీతో కలిసి చూడవచ్చని హీరో కిరణ్ అబ్బవరం అన్నారు. ఆ చిత్ర దర్శకుడు జైన్స్ నానితో కలిసి గురువారం తిరుమల శ్రీవారిని ఆయన దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, అక్టోబరు 18న సినిమా విడుదల కానున్న నేపథ్యంలో స్వామి ఆశీస్సుల కోసం తిరుమలకు వచ్చామన్నారు. కాగా 'చెన్నై లవ్ స్టోరీ' అనే చిత్రంతో పాటు మరో రెండు ప్రాజెక్టులు కూడా చేస్తున్నట్టు వెల్లడించారు.

→ కిరణ్ అబ్బవరం, జైన్స్ నాని

శ్రీవారి సేవలో ప్రముఖులు





గుమ్మనూరు జయరాం - శంకర్ గౌడ్, కిరణ్‌రాయల్

తిరుమల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, హైదరాబాద్ హిమాయత్‌నగర్ టీటీడీ ఎల్‌ఏసీ చైర్మన్ శంకర్ గౌడ్, తిరుపతి జనసేన ఇన్‌ఛార్జ్ కిరణ్‌రాయల్ ఉన్నారు.

రైల్వే ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించండి

తిరుపతి(సెంట్రల్), అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యం కల్పించాలని దక్షిణ మధ్యరైల్వే గుంతకల్లు డివిజన్ అదనపు డివిజన్ మేనేజరు యు.సుధాకర్ ఆదేశించారు. తిరుపతి రైల్వే స్టేషన్‌ను గురువారం ఆయన తనిఖీ ఆధునికీకరణ పనులు జరుగుతున్న సమయంలో ప్రయాణికులకు కల్పిస్తున్న సదుపాయాలను పరిశీలించారు. పెరుగుతున్న రద్దీని దృష్టిలో ఉంచుకొని వసతులు పెంచాలని ఆదేశించారు. అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. డీఈఈ వీరయ్య, స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, ఎస్ఎంఆర్ డాక్టర్ కె.చిన్నపరెడ్డి, ఎస్ఎస్ఈలు సిద్దారెడ్డి, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సర్వదర్శనానికి 10 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 2 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.3.79 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 75,919

తలనీలాలు సమర్పించినవారు: 28,218

యువతే మన దేశ సంపద



ఎస్వీయూ ఏడీ భవనం ముందు కళా ప్రదర్శనగా వస్తున్న విద్యార్థులు



విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తున్న సినీ నటుడు కిరణ్ అబ్బవరం

- 'యువతరంగ్' ప్రారంభోత్సవంలో ఎస్వీయూ వీసీ
- ఆకట్టుకున్న ర్యాలీ, కళా ప్రదర్శనలు



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎస్వీయూ వీసీ నరసింగరావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): యువతే మన దేశానికి నిజమైన సంపద అని ఎస్వీ యూనివర్సిటీ వీసీ టి.నరసింగరావు పేర్కొన్నారు. స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు సాగే 'యువతరంగ్-2025' గురువారం ప్రారంభమైంది. శ్రీనివాస ఆడిటోరియంలో జరిగిన ప్రారంభ సభలో వీసీ మాట్లాడారు. కళలు మనిషిని మానవీయంగా మారుస్తాయని అభిప్రాయపడ్డారు. తనకు వ్యక్తిగతంగా కళలు, సంగీతం పట్ల ఆసక్తి ఉన్నా, సాధన చేయడం సాధ్యం కాలేదని తెలిపారు. ప్రస్తుతం వీలైన మేరకు సంగీతాన్ని సాధన చేస్తున్నట్లు చెప్పారు. యువత ఏదో ఒక కళలో ప్రావీణ్యం సంపాదించాలని రిజిస్ట్రార్ భూపతి నాయుడు సూచించారు. యూనివర్సిటీ విద్యార్థులను అద్భుతమైన క్రీడాకారులుగా, కళాకారులుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు సూచించారు. యూనివర్సిటీ పరిధిలో కళలకు సంబంధించిన ప్రత్యేక కోర్సులు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలేజీ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (సీడీసీ) డీన్ ప్రొఫెసర్ చెంగ్రాయుడు, ఆర్ట్స్ కామర్స్ ఇంజనీరింగ్ ప్రిన్సిపాళ్ళు సుధారాణి, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, స్టూడెంట్ వెల్ఫేర్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీవీ మురళీధర్,



కల్చరల్ అఫైర్స్ కో- ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్, డాక్టర్ కళ్యాణ్, డాక్టర్ రంజిత్ కుమార్, డాక్టర్ ఉదయ్, రాజశేఖర్, ప్రసన్న, స్వరూప్, అధ్యాపకులు, విద్యార్థులు, వివిధ ప్రాంతాల కళాకారులు పాల్గొన్నారు. అంతకుముందు అన్నమయ్య భవన్ నుంచి శ్రీనివాసా ఆడిటోరియం దాకా కళాబృందాలు, విద్యా



ర్థులు ర్యాలీగా వెళ్లారు.

ప్రత్యేక ఆకర్షణగా కిరణ్ అబ్బవరం

యువతరంగ్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న నటుడు కిరణ్ అబ్బవరం ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడంతో తానెంతో ఉత్తేజం పొందానని చెప్పారు. తనకు వచ్చిన గుర్తింపునకు యువత ముఖ్య కారణమన్నారు. తనకు పాతికేళ్ల వయసులో జీవిత లక్ష్యం అర్థమైందని, సినిమా రంగంలో కళాకారుడిగా రాణిస్తాననే నమ్మకం పెరిగిందని గుర్తుచేసుకున్నారు.

రసవత్తరంగా పోటీలు

గురువారం మధ్యాహ్నం నుంచి మూడు సమాంతర వేదికలపై చేపట్టిన సాంస్కృతిక పోటీలు రసవత్తరంగా సాగాయి. సుమారు 30 అంశాలపై వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు, కళా బృందాలు ప్రదర్శనలు ఇచ్చారు. విజేతలకు ముగింపు సభలో బహుమతులు ప్రదానం చేయనున్నారు.



వివిధ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

భార్యకు నిప్పంటించిన భర్త

చంద్రగిరి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తు. ఆపై గొడవ. దీంతో భార్యపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు వెంకటేష్. ఈ ఘటన చంద్రగిరి మండలం తొండవాడ పంచాయతీ పరిధిలోని ఉగ్రప్రత్యంగిరాదేవి ఆలయం సమీపంలోని నిమ్మతోటలో మంగళవారం రాత్రి జరిగింది. వెంకటేష్, హరిత దంపతులది సదుం మండలం. తొండవాడ సమీపంలోని వెంకటకృష్ణ నిమ్మతోటకు ఎనిమిదేళ్లుగా కాపలాదారులుగా ఉంటున్నారు. మంగళవారం రాత్రి భార్యభర్తలు మద్యం తాగారు. ఆపై వారి మధ్య గొడవ జరగడంతో అక్కడే ఉన్న పెట్రోల్‌ను భార్యపై పోసి నిప్పటించాడు. ఆమె కేకలు వేస్తుండగా, వెంకటేష్ రోడ్డుపైకి వచ్చి జరిగిన విషయాన్ని స్థానికులు చెప్పాడు. ఆమెను 108 వాహనంలో తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

డిసెంబరు 18నుంచి యంగ్ బర్డర్ శిబిరం

ఏర్పేడు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పక్షులు,పర్యావరణంపై విస్తృత అవగాహన కల్పించేందుకు ఐసర్, షోలా స్కై ఐలాండ్స్ సంయుక్తంగా ఓ శిబిరం నిర్వహించనున్నాయి. యంగ్ బర్డర్ పేరిట డిసెంబరు 18 నుంచి 22 వరకు ఐసర్ ప్రాంగణంలో శిబిరం నిర్వహించనున్నారు. 14 నుంచి 18 ఏళ్ల ఔత్సాహిక విద్యార్థులు ఇందులో పాల్గొనవచ్చునని ఐసర్ అధికారులు తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు నవంబరు 15వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. 20 మందిని ఎంపిక చేయనున్నారు. పర్యావరణం,పక్షుల పట్ల ఆసక్తి, ప్రకృతిపై అనురక్తి పెంపొందించేందుకు ఈ శిబిరం దోహదపడుతుందన్నారు. దరఖాస్తుతో పాటు మర్ని వివరాలకు స్కైలాండ్.ఇన్./వైబీసీ25.హెచ్‌టీఎంఎల్‌ను చూడాలని సూచించారు.

తిరుపతి- సికింద్రాబాద్ మధ్య నేడు, రేపు ప్రత్యేక ఏసీ రైళ్లు

తిరుపతి(సెంట్రల్), అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని శుక్ర, శనివారాల్లో తిరుపతి- సికింద్రాబాద్ మధ్య ఏసీ ప్రత్యేక రైళ్లు నడుపుతున్నామని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ తెలిపారు. ఈ ప్రత్యేక రైలు (09497) తిరుపతిలో శుక్రవారం బయలుదేరి గూడూరు, తెనాలి, నడికుడి, నల్లగొండ మీదుగా మరుసటి రోజు సికింద్రాబాదుకు చేరుకొంటుంది. ఈ ప్రత్యేక రైలు (09498) సికింద్రాబాదులో బయలుదేరి బేగంపేట, వికారాబాదు, రాయచూర్, ఆదోని, గుంతకల్లు, కడప, మీదుగా తిరుపతికి మరుసటి రోజు చేరుకొంటుంది. ఈ ప్రత్యేక రైలుకు పూర్తిగా 3 ఏసీ పెట్టెలు ఉంటాయి.



ప్రధాని సభకు ముస్లిం మహిళలు



సభకు వేలాది బస్సులు ఇలా...



మోదీతో చంద్రబాబు, పవన్







నమో..జోష్

'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్' పేరిట కర్నూలులో గురువారం జరిగిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన విజయవంతమైంది. శ్రీశైలం మల్లికార్జున స్వామి, భ్రమరాంబికాదేవి అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం ఆయన తిరిగి కర్నూలుకు చేరుకున్నారు. ప్రధానితో పాటు సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ రావడంతో కూటమి శ్రేణులు భారీగా తరలివచ్చాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అభిమానులు, టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలతో సభాప్రాంగణం నిండిపోయింది. ఓర్వకల్లు మండలం కర్నూలు-నంద్యాల జాతీయ రహదారి పక్కన నన్నూరు రాగమయూరి వెంచర్‌లో ఏర్పాటు చేసిన ప్రధాని సభకు దాదాపు 3 లక్షల మందికి పైగా ప్రజలు తరలివచ్చారు. వేలాది వాహనాల్లో తరలి రావడంతో కర్నూలు కిక్కిరిసిపోయింది. ఇక సభావేదిక వద్ద తెలుగుదేశం పార్టీ యువత కదనోత్సాహం... జనసైనికుల ఆనందం.. బీజేపీ శ్రేణుల కోలాహలం.. వెరసి ప్రధాని సభ సూపర్ సక్సెస్ అయింది.

\- కర్నూలు (ఆంధ్రజ్యోతి)






శివాజీ స్ఫూర్తి కేంద్రంలో మోదీ



సభలో ఉప్పొంగిన దేశభక్తి



సభలో టీడీపీ మహిళా నేతలు

పొలాల వెంబడి పరుగులు

పారిశ్రామికంగా చిల్లకూరు అభివృద్ధి

- సుమారు రూ.4500 కోట్లతో పనులు
- రెండేళ్లలో అభివృద్ధి పనులు పూర్తి



సాగర్‌మాల రోడ్డు పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

చిల్లకూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు మండలం త్వరలోనే పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని తద్వారా ఎంతో మందికి ఉపాధి కలుగుతుందని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. గురువారం మండలంలో జరుగుతున్న సాగరమాల, క్రిస్‌సిటీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో చెన్నై- కోల్‌కత్తా జాతీయ రహదారులను కృష్ణపట్నం పోర్టుకు అనుసంధానం చేస్తూ సుమారు రూ. 3వేల కోట్లతో సాగరమాల రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. వరగలి క్రాస్‌రోడ్డు నుంచి 35 కిలోమీటర్లు, నాయుడుపేట నుంచి 36 కిలోమీటర్లు, ముత్తుకూరు నుంచి 19 కిలోమీటర్లు వరకు సాగరమాల రోడ్ల పనులు జరుగుతున్నాయన్నారు. సాగరమాల రోడ్డు నిర్మాణ పనుల్లో భూసమస్యలు, మైనింగ్, ఇరిగేషన్ వంటి సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపడుతామన్నారు. నాయుడుపేట నుంచి కృష్ణపట్నంపోర్టు సౌత్‌గేట్ వరకు నిర్మిస్తున్న సాగరమాల రోడ్డు పనులను 2027 జూన్ కల్లా పూర్తిచేసేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ రోడ్లు కృష్ణపట్నపోర్టుకు అనుసంధానం చేయడం ద్వారా మండలంలో ఎక్కువశాతం పరిశ్రమలు రానున్నాయన్నారు. అదేవిధంగా తమ్మనపట్నంలో 2500 ఎకరాల్లో క్రిస్‌సిటీ పారిశ్రామకవాడను ఏర్పాటు చేయనున్నామన్నారు. క్రిస్‌సిటీలో 1200 కోట్లు రూపాయల పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం రూ.200 కోట్లు అభివృద్ధిపనులు జరుగుతున్నాయ న్నారు. వచ్చే ఏడాది డిసెంబరు కల్లా క్రిస్‌సిటీలో రూ.1200 కోట్లు అభివృద్ధిపనులు పూర్తవుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జీ ఆర్డీవో భానుప్రకాశ్‌రెడ్డి, తహసీల్దారు శ్రీనివాసులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

టిప్పర్ ఢీకొని సర్వేయర్ దుర్మరణం



సర్వేయర్ సునీత (ఫైల్‌ఫొటో)

నాగలాపురం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): టిప్పర్ ఢీకొని మండల సర్వేయర్ మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు... మండల సర్వేయర్ సునీత (35), సురుటుపల్లి సచివాలయ సర్వేయర్ దినేష్‌లు గురువారం సాయంత్రం సురుటుపల్లిలో ఓ స్థలాన్ని సర్వే చేశారు. అనంతరం దినేష్ ద్విచక్రవాహనంపై ఈమె నాగలాపురానికి బయలుదేరారు. బయటకొడియంబేడు వద్ద వెనుక వస్తున్న ఒక టిప్పర్ లారీ అధిగమించే క్రమంలో వీరి ద్విచక్ర వాహన స్టీరింగ్‌ను తాకింది. దీంతో ద్విచక్రవాహనం అదుపు తప్పింది. దినేష్, సునీతలు చెరోవైపు పడిపోయారు. లారీ చక్రం ఈమె తలభాగం మీదుగా వెళ్లడంతో సునీత సంఘటనా స్థలంలోనే ప్రాణాలు విడిచింది. దినేష్‌కు స్వల్పగాయాలయ్యాయి. ఆమె మృతదేహాన్ని సత్యవేడు వైద్యశాలకు తరలించారు. క్షతగాత్రుడిని నాగలాపురం పీహెచ్‌సీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి భర్త వెంకటేశులు టీటీడీలో ఏఈగా పనిచేస్తున్నారు. వీరికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

వృద్ధుడికి డెంగ్యూ

రేణిగుంట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ సీఆర్‌నగర్ కాలనీలో ఈశ్వరయ్య అనే వృద్ధుడు డెంగ్యూ బారినపడ్డాడు. పంచాయతీ సిబ్బంది ఆ ప్రాంతంలో పారిశుధ్య నిర్వహణ చర్యలు చేపట్టారు. బ్లీచింగ్ చల్లి, నీటి ట్యాంకులను శుద్ధి చేశారు.

సూపర్ జీఎస్టీ 2.0 తగ్గింపును సద్వినియోగం చేసుకోండి



జీఎస్టీపై అవగాహన ర్యాలీ ప్రారంభిస్తున్న జేటీసీ కృష్ణవేణి, టీడీపీ మురళీమోహన్ తదితరులు

- జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ కృష్ణవేణి

తిరుపతి(రవాణా), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ 2.0తగ్గింపు ద్వారా కలిగే ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని రవాణాశాఖ జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ (జేటీసీ) కృష్ణవేణి పిలుపునిచ్చారు. దీనిపై రవాణాశాఖ ఆధ్వర్యంలో తిరుపతిలో చేపట్టిన అవగాహన ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. జిల్లాలో వాహనాల కొనుగోలుపై జీఎస్టీ రేటు తగ్గింపుతో ప్రజలకు కలిగే ఆదాపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ఉద్దేశ్యమన్నారు. కొనుగోలుదారులు తమ సందేహాలను నివృత్తి చేసుకునేలా తిరుపతి రవాణాశాఖ కార్యాలయంలో వాహన డీలర్లతో స్టాళ్లను ఏర్పాటు చేశామని జిల్లా రవాణాశాఖాధికారి కొర్రపాటి మురళీమోహన్ చెప్పారు. ఆటోమొబైల్ రంగంలో నూతనంగా వచ్చిన వాహనాలను ప్రజలకు చూశారు. జీఎస్టీపై ఫిర్యాదు చేయదలుచుకుంటే టోల్‌ఫ్రీ నెంబరు 1915కు సమాచారం ఇవ్వాలని జీఎస్టీ అధికారులు రాజ్యలక్ష్మి, నవీన్‌కుమార్‌రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, మోహన్‌కుమార్, రమణనాయక్, ఆంజనేయ ప్రసాద్, స్వర్ణలత, పరిపాలన అధికారులు, విజయప్రశాంతి, విజయకుమార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



రవాణాశాఖ కార్యాలయంలో వాహనాల స్టాల్స్‌ను ఏర్పాటుచేసిన దృశ్యం

పుత్తూరు వార్తలు

ఆహార వినియోగం మీద అవగాహన


మాట్లాడుతున్న చంద్రమౌళి

పుత్తూరు,అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి చెందిన దేశాల్లో అధిక వ్యర్థం వల్ల ఆహార సమస్య ఉత్పన్నమవుతోందని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి అన్నారు. ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా కళాశాలలో గురువారం ఆహార ప్రాముఖ్యత- నియంత్రణ మీద అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోషకాలతో కూడిన సమతుల్య ఆహారం మితంగా తీసుకుంటే ఆరోగ్యం బాగుంటుందన్నారు. ఆహార భద్రత, సమానత, పరిరక్షణ మీద అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు సుజన, నరసింహులు, బాబురావులు పాల్గొన్నారు.

సమస్యలు నివేదిస్తే పరిష్కారానికి కృషి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

పుత్తూరు టౌన్, అక్టోబర్ 16(ఆంధ్రజ్యోతి): సంక్షేమ,అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎంపీపీ మునివేలమ్మ సూచించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షతన నిర్వహించారు. ఎంపీడీవో శ్రీదేవి మాట్లాడుతూ సభ్యులు సమస్యల గురించి వివరిస్తే ప్రభుత్వానికి నివేదించి పరిష్కారిస్తామన్నారు. తడుకు సర్పంచ్ మాట్లాడుతూ వేణుగోపాలపురం, వీఎస్ఎస్ పురం గ్రామాల రోడ్డు అధ్వానంగా ఉన్నాయన్నారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని అధికారులు తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ అశోక్ రెడ్డి, ఎంఈవో తిరుమలరాజు, ఏఈలు సురేంద్ర, జయసాయి, వైస్ ఎంపీపీ మునస్వామి రెడ్డి, విమలమ్మ, డీఎస్ గణేష్, మోహన్ రాజు, కరుణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ సంస్కరణలపై ప్రచారం


కరపత్రాలు పంపిణీ చేస్తున్న షణ్ముగరెడ్డి

పుత్తూరు అర్బన్, అక్టోబర్ 16(ఆంధ్రజ్యోతి): పేద, మధ్యతరగతి కుటుంబాలకు జీఎస్టీ సంస్కరణలతో ప్రయోజనం కలుగుతుందని రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ షణ్ముగరెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణ పార్టీ అధ్యక్షుడు జీవరత్నం నాయుడుతో కలిసి ఆయన ఏజీ కాలనీలో ఇంటింట ప్రచారం నిర్వహించారు. నిత్యావసర సరుకులు, గృహోపకరణాలు, ఔషధాలు, స్టేషనరీ ఉత్పత్తులు, వస్త్రాలు, క్రీడా వస్తువులు తదితర వస్తువులపై జీఎస్టీ తగ్గింపు వర్తిస్తుందని అవగాహన కల్పించారు. ఏఎంసీ డైరెక్టర్ ఉమాశంకర్ రెడ్డి, ఈశ్వర్ యాదవ్, చెంచయ్య, లోకేష్, హేమాద్రి, అర్జునయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

టీపీవోకు ఏసీపీగా పదోన్నతి

● అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ


నీరజాక్షి

పుత్తూరు అర్బన్, అక్టోబర్ 16(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపాలిటీలోని పట్టణ ప్రణాళిక విభాగం అధికారి ఎం.నీరజాక్షికి అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా పదోన్నతి లభించింది. ఈ మేరకు రాష్ట్ర పట్టణ ప్రణాళిక విభాగం డైరెక్టర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె ఏసీపీగా పదోన్నతితో అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ అయ్యారు. దీపావళి తరువాత విధుల్లో చేరనున్నట్లు ఆమె వివరించారు. నగరి పట్టణ ప్రణాళిక విభాగం అధికారి జాకీరా కాతూన్‌కు ఏసీపీగా పదోన్నతిపై. గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ అయ్యారు.

ఈ-పంట నమోదు చేసుకోవాలి

వడమాలపేట,అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి విజయ్ కుమార్ చెప్పారు. రైతు సేవా కేంద్రం ఇన్చార్జులు, వ్యవసాయ శాఖ యాప్‌లో పంట వివరాలు నమోదు చేసుకోవాన్నారు. తద్వారా పంటల బీమా, నష్ట పరిహారం, గిట్టుబాటు ధరల చెల్లింపుతో పాటు, సున్నా వడ్డీ రుణాల వంటి పథకాలకు అర్హులవుతారన్నారు. నెలాఖరులోగా నమోదు చేసుకోవాలని కోరారు.

రేపు మండల సమావేశం

వడమాలపేట,అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో హరినాథ్‌బాబు తెలిపారు. ఎంపీపీ విజయలక్ష్మిపై ఎంపీటీసీలు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టిన నేపథ్యంలో ఏడుగురు ఎంపీటీసీలకు గాను ఆరుగురు తిరుగుబాటు చేశారు. దీంతో ఎంపీపీ ఏకాకిగా మిగిలిపోయారు. సాధారణంగా మండల సమావేశం ఎంపీపీ అధ్యక్షతన జరగాలి. ఇందుకు ఎంపీటీసీలు ఒప్పుకుంటారా, లేదా అనే సందేహాలు వ్యక్త మవుతున్నాయి. ఈనేపథ్యంలో సమావేశం ప్రాధాన్యత సంతరించుకోంది.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

పుత్తూరు అర్బన్, అక్టోబర్ 16(ఆంధ్రజ్యోతి): కేబీఆర్ పురంలో ఉంటున్న తన చెల్లెలు దీప(17) కనిపించడం లేదని ఆమె సోదరి సోనూ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.. వెంకటగిరికి చెందిన సోను వివాహం అనంతరం భర్తతో పాటు పుత్తూరు కేబీఆర్ పురంలో ఉంటున్నారు. ఇంటర్‌తో చదువు నిలిపేసిన దీప అక్క దగ్గర ఉండేది. ఈ క్రమంలో ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదని ఫిర్యాదులో పేర్కొంది.

తృటిలో తప్పిన ప్రమాదం

పుత్తూరు అర్బన్, అక్టోబర్ 16(ఆంధ్రజ్యోతి): పిల్లారపట్టు కూడలిలో గురువారం ఓ లారీ బోల్తా పడింది. నిత్యం రద్దీగా ఉండే ఈ కూడలిలో డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో లారీ పక్కకు పడిపోయింది. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. ప్రమాదానికి కారణాలను పోలీసులు చేరుకుని ఆరా తీస్తున్నారు.

నకిలీ మద్యం కట్టడికి సురక్ష యాప్

పుత్తూరు అర్బన్, అక్టోబర్ 16(ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం కట్టడికి ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌తో ఉపకరిస్తుందని ఎక్సైజ్ సీఐ మురళీ మోహన్ తెలిపారు. గురువారం ఆయన మద్యం దుకాణ లైసెన్స్‌దారులతో సమావేశం నిర్వహించారు. మద్యం విషయంలో పారదర్శకతకు యాప్‌ను రూపొందించినట్లు పేర్కొన్నారు. యాప్ వినియోగంపై అవగాహన కల్పించారు. నకిలీ మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

వృద్ధురాలి మెడలో చైన్ చోరీ

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): వృద్ధురాలి మెడలో చైన్ చోరీ చేసిన ఘటన గురువారం నగరంలోని బెస్తవీధిలో చోటు చేసుకుంది. వెస్ట్ సీఐ మురళీమోహన్ వివరాల మేరకు.. బెస్తవీధికి చెందిన మనోహరమ్మ చెల్లెలు మనవడు అఖిల్‌ను రెండేళ్ల క్రితం కొందరు హత్య చేశారు. తాజాగా నిందితుడు తాను అఖిల్ స్నేహితుడినని చెప్పి ఇంటి వద్ద ఉన్న మనోహరమ్మ వద్దకు వచ్చి మెడలో ఉన్న 16 గ్రాముల బంగారు చైను లాక్కుని పారిపోయాడు. ఆమె గట్టిగా చైన్‌ను పట్టుకోవడంతో సవరం బంగారు ఉండిపోయింది. సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

శ్రీకాళహస్తి ఆర్డీవోకు అదనపు బాధ్యతలు

గూడూరు అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గూడూరు డివిజన్ ఇన్‌చార్జి ఆర్డీవోగా శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ సబ్‌కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న రాఘవేంద్రమీనా బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో భానుప్రకాష్ రెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగించారు.

వ్యాయామ ఉపాధ్యాయులకు సన్మానం



కోట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కోటలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గురు వారం డీఎస్సీ ద్వారా ఎంపికైన ఐదుగురు వ్యాయామ ఉపాధ్యాయులకు అభినంద సభ జరిగింది. కొక్కుపాడు, కోట బాలికల ఉన్నత పాఠశాల, పెదగోవిందపల్లి ఉన్నత పాఠశాల, కోట ఎస్సీ రెసిడెన్షియల్, చిట్టేడు ఎస్సీ రెసిడెన్షియల్ వ్యాయామ ఉపాధ్యాయులు డీఎస్సీ ద్వారా పోస్టులు పొందారు. వీరిని ఎంఈవో మస్తానయ్య, హెచ్ఎం కరుణాకర్‌రెడ్డి, బాలికల గురు కుల ప్రిన్సిపాల్ రజనీ, ఫిజికల్ డైరెక్టర్లు రాజ్‌కుమార్, రమణయ్య, ధనంజయ, సంధానిబాషా, వలీ అహ్మద్, సుభాన్, కరీముల్లా, శ్రీనివాసులు, కార్తీక్‌లు అభినందించారు.

రైతులకు యూరియా కార్డుల పంపిణీ

వాకాడు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండాపురం పంచాయతీలోని రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అందిస్తున్న యూరియా కార్డులను టీడీపీ నాయకుడు తుమ్మల మోహన్‌నాయుడు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా తుమ్మల మోహన్‌నాయుడు మాట్లాడుతూ ఈ కార్డులతో రైతు సేవా కేంద్రాలలోనూ, ప్రైవేట్ షాపుల లోనూ యూరియాను పొందవచ్చన్నారు. రైతులు నానో యూరియా, నానో డీఏపీ ఎంచుకొని తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు సాధించవచ్చని వివరించారు.

చట్టాలు అమలు చేయాలి

గూడూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ కార్మికులకు కార్మికచట్టాలను అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తులసీరామ్ అన్నారు. గురువారం స్థానిక ఆర్టీసీ డిపోలో ఆర్టీసీ డీఎం లక్ష్మికి సీఐటీయూ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిపోలో పనిచేస్తున్న స్వీపర్లు, వివిధరకాల కార్మికులకు వేతనాలను సక్రమంగా అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మల్లికార్జున, కేఎస్‌వాసులు, రఘురామయ్య, బీవీరమణయ్య పాల్గొన్నారు.

సుప్రీం న్యాయమూర్తిపై దాడి గర్హనీయం: కాంగ్రెస్



నిరసన కార్యక్రమంలో మాజీ ఎంపీ చింతామోహన్

గూడూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు న్యాయమూర్తిపై జరిగిన దాడిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ ఎంపీ చింతామోహన్ అన్నారు. గురువారం స్థానిక టవర్‌క్లాక్ కేంద్రం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో దళితులపై దాడులు ఎక్కువయ్యాయన్నారు. హర్యానా రాష్ట్రంలో ఎస్సీ డీజీపీ వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డార న్నారు. వైసీపీ, టీడీపీ ప్రభుత్వాల్లో ఎస్సీ విద్యార్థులకు రావాల్సిన ఉపకారవేతనాలు అందడంలేదన్నారు. జీఎస్టీ తగ్గించడం వలన సామాన్యులకు ఎటువంటి ఉపయోగంలేదని కేవలం ఉన్నత వర్గాల వారికి మాత్రమే లాభం చేకూరుతుందన్నారు. దుగరాజపట్నం పోర్టును నిర్మిస్తే ఈ ప్రాంతంలో లక్షలాదిమందికి ఉద్యోగ అవకాశాలు వచ్చేవన్నారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణారావు, చిరంజీవి పాల్గొన్నారు.

ఆంధ్రుల ఆరాధ్యదైవం ఎన్టీఆర్

● ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు భూమిపూజలో ఎమ్మెల్యే విజయశ్రీ


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, నెలవల

నాయుడుపేట టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రుల ఆరాధ్యదైవం స్వర్గీయ నందమూరి తారకరామారావు అని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. పట్టణంలోని సీఎస్ తేజా సెంటర్ కూడలి వద్ద మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహ ఏర్పాటుకు గురువారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రముఖ పారిశ్రామికవేత్త, టీడీపీ సీనియర్ నేత కొండేపాటి గంగాప్రసాద్ సహాయ సహకారాలతో ఈ విగ్రహ ఏర్పాటును చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ కుమార్, టీడీపీ నాయకులు శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, రఫీ, సుధాకర్‌రెడ్డి, నెలవల రాజేష్, ఆదవరం నాగూరయ్య, పసల గంగాప్రసాద్, పొట్లపూడి రాజేష్, పాదర్తి ప్రకాష్ నాయుడు, గాలి రాజేష్‌నాయుడు, నిత్యకృష్ణారెడ్డి, గూడూరు ప్రభావతమ్మ, ఈతముక్కల వెంకట సుబ్బానాయుడు, రవిబాబు, లక్ష్మయ్య, సుబ్బారావు, రవి, నారాయణ, సుధీర్‌రెడ్డి, అవధానం సుధీర్, మాధవనాయుడు, చెంగయ్య, శివయ్య, సంచి కృష్ణయ్య, అత్తికాయల సుబ్రహ్మణ్యం, విజయ కుమార్‌నాయుడు, మాజీ ఎంపీపీ కన్నెమ్మ, దార్ల రాజేంద్ర పాల్గొన్నారు.

తల్లికి వందనం అందించాలని కలెక్టర్‌కు వినతి



చిల్లకూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం అందించాలని గురువారం మండలంలోని తిక్కవరం వద్ద టీడీపీ మండల అధ్యక్షుడు దువ్వూరు రాజశేఖర్‌రెడ్డి, టీడీపీ నాయకులు, స్థానికులు కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందించారు. తిక్కవరం ఉన్నత పాఠశాలలో చదువుతున్న 302 మంది విద్యార్థులకు తల్లివందనం నగదు తల్లిదండ్రుల ఖాతాలలో జమకాలేదని రాజశేఖర్‌రెడ్డి కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో జనవరి లోపు తల్లికివందనం వచ్చేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా ఉడతావారిపార్లపల్లి వద్ద సాగరమాల రోడ్డుపై ఫ్లైఓవర్ వంతెన నిర్మించాలని కలెక్టర్‌ను స్థానికులు కోరారు. ఈ కార్యక్రమంలో జానకిరామిరెడ్డి, సుప్రజ, కుమార్‌యాదవ్, మునిశేఖర్‌గౌడ్, ప్రవీణ్‌రెడ్డి, మురళీరెడ్డి తదితరులు ఉన్నారు.

రూ.2 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన


శిలఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పక్కనే ఏఎంసీ చైర్మన్ రమేష్, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ కిషోర్ టీడీపీ నాయకులు

సూళ్లూరుపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మున్సిపాలిటీలో రూ.2 కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైయిన్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ గురువారం శంకుస్థాపన చేశారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలోని ఆర్‌అండ్‌బి బంగ్లా వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఎమ్మెల్యే మున్సిపాలిటీ అధికారులు, టీడీపీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవసరమైన చోట సీసీ రోడ్లు, డ్రైయిన్‌లు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య, తహసీల్దార్ గోపినాథ్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ ఏజీ కిషోర్, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ నాయుడు, టీడీపీ నాయకులు అలవల శ్రీనివాసులు, తిరుమలరావు, వైసతీష్, సురేష్‌నాయుడు, బొమ్మన్ పళణి, వెంకటేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చెంగాళమ్మ హుండీ ఆదాయం రూ.59.79 లక్షలు

సూళ్లూరుపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ హుండీ ఆదాయాన్ని గురువారం దేవదాయశాఖ ఆధ్వ ర్యంలో లెక్కింపు చేపట్టారు. మొత్తం 102 రోజులకుగాను అమ్మవారికి కానుకల రూపంలో 59,79,520 ఆదాయం వచ్చినట్లు సహాయ కమిషన్ ప్రసన్న లక్ష్మి తెలిపారు. ఇవి కాకుండా బంగారం 0.48 గ్రాములు, వెండి 0.69 గ్రాములు, విదేశీ కరెన్సీ యుఎస్ఏ డాలర్స్ 185, సింగపూర్ డాలర్ 15, యుఏఈ దీరామ్స్ 30, సౌదీ రియాల్స్ 15, నేపాల్ రూపాయి 10 హుండీ కానుకల రూపంలో ఆదాయం చేకూరింది. గూడూరు దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ బాబ, సహాయ కమిషనర్ ప్రసన్న లక్ష్మి పర్యవేక్షణలో లెక్కింపు జరిగింది.

ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు మేలు

పెళ్లకూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలతో అనేక మంది పేదలకు ఉచిత వైద్యం అందుతుందని పంచాయతీ రాజ్ ఛాంబర్ రాష్ట్ర కార్యదర్శి, బంగారంపేట సర్పంచు దేవారెడ్డి నాగేంద్రప్రసాద్ రెడ్డి పేర్కొ న్నారు. గురువారం మండలంలోని బంగారంపేట గ్రామంలో నెల్లూరు నారాయణ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహిం చారు. డాక్టర్ నివిత, ప్రశాంత్, పీఆర్వో నందకిశోర్ ఉన్నారు.

ఏరియా ఆస్పత్రికి ఇన్వర్టర్ వితరణ


ఏరియా ఆసుపత్రికి ఇన్వర్టర్ అందజేస్తున్న ప్రగతిసేవాసంస్థ సభ్యులు

గూడూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆసుపత్రికి ప్రగతి సేవాసంస్థ, శ్రీకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో గురువారం ఇన్వర్టర్‌ను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు కటివేటి చంద్రశేఖర్, మయూరి శ్యామ్‌యాదవ్ మాట్లాడుతూ ఏరియా ఆసుపత్రిలోని ఆపరేషన్ థియేటర్‌కు అవసరమైన ఇన్వర్టర్‌ను అందించామన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా, డాక్టర్ రాజా, డాక్టర్ ప్రసూన, మురళీనాయుడు, ప్రభాకర్, రాము, నాగరాజు, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు నిత్యావసరాల పంపిణీ

గూడూరు అర్బన్: స్థానిక డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలులో గురువారం వైజేపీ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. క్లబ్ ప్రతినిధి ఆర్‌వీరావు, సుధాకర్, శ్రీనివాస్, గోపీనాధ్‌రెడ్డి, ప్రసాద్, మురళీ నాయుడు, గురునాథం పాల్గొన్నారు.

కార్మికుడికి గాయాలు

పెళ్లకూరు: మండలంలోని పెన్నేపల్లి గ్రామం లో ఎంఎస్ అగర్వాల్ పరిశ్రమలో పనిచేస్తున్న వలస కార్మికుడు మోహన్‌దాస్ కుడికాలిపైకి గురువారం క్రేన్ దూసుకెళ్లింది. గాయపడిన అతడిని పరిశ్రమ యజమాన్యం నాయుడుపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం చెన్నై తరలించారు.

సాగరమాల పనుల పరిశీలన

కోట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : కోట మండలం కొత్తపట్నం పంచాయతీలోని సాగరమాల ప్యాకేజీ-4 రోడ్డు పనులను గురువారం కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ పరిశీలించారు. నాయుడుపేట, కృష్ణపట్నం పోర్టుకు వెళ్లే సాగరమాల ప్యాకేజీ-4 రోడ్డు పనులు 31 కిలోమీటర్ల వరకు జరుగుతున్నాయి. రూ.1200 కోట్ల వ్యయంతో చేపట్టిన పనుల నాణ్యతను స్వయంగా పరిశీలించారు. అక్కడ నుంచి నేరుగా కనుపూరు మీదుగా కోటకు చేరుకొని అక్కడ నుంచి గూడూరు వైపు వెళ్లారు. ఆయన వెంట గూడూరు ఇన్‌చార్జి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, తహసీల్దారు జయజయరావు, సర్వేయర్ గోపీరెడ్డి, ఆర్ఐ ప్రసాద్, వీఆర్వో శ్రీనివాసులు, సాగరమాల రోడ్డు ఇంజనీర్లు ఉన్నారు.

సైన్స్‌పై అవగాహన పెంచేందుకే చెకుముకి పోటీలు

గూడూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులలో సైన్స్‌పట్ల అవగాహన పెంపొందించేందుకు జేవీవీ ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు జేవీవీ పట్టణాధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక టవర్‌క్లాక్ కేంద్రం వద్ద జేవీవీ ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ పరీక్షల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 18వ తేదీన పాఠశాల స్థాయిలో, నవంబరు 1వ తేదీన మండలస్థాయిలో పోటీలను నిర్వహిస్తామని వివరించారు. మండలస్థాయిలో ఎంపికైన వారు జిల్లాస్థాయి పోటీలకు అర్హత సాధిస్తారన్నారు. నాగరాజు, చెంచునారాయణ, రజనీకాంత్, ఇబ్రహీం, శ్రీనివాసాచారి, సురేష్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలను సాధించాలి

చిల్లకూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని హెచ్ఎం అనసూయ అన్నారు. గురువారం మండలంలోని పారిచెర్లవారి పాళెం జడ్పీఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు శెనగ మస్తానయ్య సహకారంతో ఇంగ్లీష్ స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దాతలు అందిస్తున్న ప్రోత్సాహాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నతస్థాయి చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, మాధవయ్య, శ్రీనివాసులు, ప్రజేంద్రరెడ్డి, సుగుణ, నాగభూషణమ్మ, మధుసూదన్‌రావు, విద్యుల్లత, కామేశ్వరి, రవీంద్ర పాల్గొన్నారు.

నిబంధనల మేరకే బాణసంచా విక్రయాలు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను పురస్కరించుకుని నిబంధనల మేరకు బాణసంచా విక్రయాలు జరపాలని తిరుపతి డీఎస్పీ భక్తవత్సలం కోరారు. నగరంలోని బాణసంచా విక్రయదారులతో ఆయన గురువారం సమావేశమయ్యారు. దుకాణాల వద్ద ఇసుక సంచులను, అగ్నిమాపక యంత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని కోరారు. పిల్లలు దుకాణం వద్దకు రాకుండా చూడాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గడువువరకు, ఎమ్మార్పీకే విక్రయించాలని సూచించారు. ఈస్ట్, వెస్ట్, యూనివర్సిటీ స్టేషన్ల సీఐలు శ్రీనివాసులు, మురళీమోహన్, రామయ్య, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఓవరాల్ చాంపియన్ శ్రీపద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలల జట్టు



తిరుపతి(క్రీడలు), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ అంతర్ కళాశాలల క్రీడా పోటీలలో శ్రీపద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలల జట్టు ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. బాస్కెట్‌బాల్, ఖోఖో, టేబుల్‌టెన్నిస్, టెన్నికాయిట్ పోటీలలో విజయం సాధించగా బాల్ బ్యాడ్మింటన్, కబడ్డీ, చెస్ పోటీలలో రన్నరప్‌గా నిలిచింది. గురువారం కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నారాయణమ్మ క్రీడాకారులను అభినందించారు. ఆమె మాట్లాడుతూ క్రీడలతో పోటీ తత్వం, నాయకత్వ లక్షణాలు అలవడుతాయన్నారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ భారతి మాట్లాడుతూ గెలుపోటములను సమభావనతో చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సైకాలజీ విభాగాధిపతి భద్రమణి, భువనేశ్వరిదేవి, పద్మశ్రీ పాల్గొన్నారు.

శాప్ చైర్మన్‌కు సన్మానం



తిరుపతి(క్రీడలు), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ అధ్యక్షుడు అనిమిని రవినాయుడిని కోచ్‌లు, సబ్‌స్టాఫ్ గురువారం సన్మానించారు. వారికి గత ఏడాది జూలై నుంచి జీతాలు రాలేదు. సమస్యను రవినాయుడు దృష్టికి తీసుకెళ్లగా పెండింగ్ జీతాలు జమయ్యేలా చర్యలు తీసుకున్నారు. తమ సమస్యను పరిష్క రించినందుకు వారు గురువారం మధ్యాహ్నం శ్రీనివాస క్రీడా సముదాయంలో శాలువకప్పి సన్మానించారు. డీఎస్‌డీవో శశిధర్ పాల్గొన్నారు.

అబాకస్‌లో ఆలిండియా రికార్డు


రిత్విక్‌రెడ్డిని అభినందిస్తున్న విద్యాసంస్థల డైరెక్టర్, ప్రిన్సిపాల్

తిరుపతి(విద్య), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): శ్రీగీతాంజలి గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌కు చెందిన బ్లూబెల్స్ స్కూల్ విద్యార్థి వై.రిత్విక్‌రెడ్డి ఆలిండియా అబాకస్ రికార్డును నెలకొల్పాడు. మాస్టర్‌మైండ్ అబాకస్ అకాడమీ ఆధ్వర్యంలో ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర స్థాయి పోటీల్లో ఈ రికార్డును సాధించాడు. జూనియర్ లెవెల్ పోటీల్లో కేవలం రెండు నిమిషాల్లో 60 అబాకస్ సమస్యలను పరిష్కరించి మొదటి స్థానాన్ని దక్కించుకున్నాడు. గురువారం తిరుపతిలోని పాఠశాలలో విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ నెల్లూరి మాధవి, ప్రిన్సిపాల్ వి.దీప అతన్ని అభినందించారు.

టీటీడీ రవాణా విభాగంలో ఘనంగా ఆయుధపూజ

తిరుమల, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): టీటీడీ రవాణా విభాగం ఆధ్వర్యంలో గురువారం ఆయుధపూజ ఘనంగా నిర్వహించారు. తిరుపతిలోని వర్క్‌షాప్‌లో ఉదయం, సాయంత్రం తిరుమల డిపోలో నిర్వహించారు. ట్రాన్స్‌పోర్టు జీఎం శేషారెడ్డి, డీఎం లక్ష్మీప్రసన్న, డీఐలు, డ్రైవర్లు, సిబ్బంది పాల్గొన్నారు. టీటీడీ రవాణా విభాగంలోని వాహనాలకు పుష్పాలంకరణ చేసి, తోరణాలు కట్టి ఆయుధపూజ నిర్వహించారు. శ్రీవారి నమూనా విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి, ప్రసాదాలు పంపిణీ చేశారు.

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

తిరుపతి(ఆటోనగర్), అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): స్థానిక రుయా ఆసుపత్రిలో ఇటీవల తొలగించిన 50 మంది కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.జయచంద్ర, టి.సుబ్రమణ్యం డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఉప కార్మిక శాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ 20 ఏళ్లుగా రుయా ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికులను నూతనంగా కాంట్రాక్టు తీసుకున్న వారు తొలగించడం భావ్యం కాదన్నారు. వారం రోజులుగా కార్మికులు ఆసుపత్రి ప్రాంగణంలో నిరసన తెలుపుతున్నా అధికారులు జోక్యం చేసుకోక పోవడం అన్యాయమన్నారు. కార్మిక శాఖ అధికారులు జోక్యం చేసుకుని వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేణుగోపాల్, బుజ్జి, చినబాబు, జి.బాలసుబ్రమణ్యం, లక్ష్మమ్మ, బి.రాణి, పి.రామమూర్తి, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం


ధ్వజస్తంభం వద్ద నీటితో శుద్ధి చేస్తున్న ఆలయాధికారులు

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) : గోవిందరాజస్వామి ఆలయంలో గురువారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈనెల 20వ తేదీన దీపావళి ఆస్థానం సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టారు. స్వామివారిని ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవతో మేల్కొలిపి తోమాలసేవ, సహస్రనామార్చన, నివేదన, శాత్తుమొర నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పులు, పూజాసామగ్రిని నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి, పసుపు, పచ్చాకు, గడ్డకర్పూరం, గంధంపొడి, కుంకుమ, కిచిలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాల మిశ్రమంతో లేపనం వేసి, శుద్ధి చేశారు. 9.30 గంటల నుంచి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో వీఆర్‌శాంతి, ఏఈవో ఏబీ నారాయణ చౌదరి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు



శ్రీకాళహస్తి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మేథో గురుదక్షిణామూర్తికి గురువారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. కలశ ప్రతిష్ట అనంతరం వినాయక పూజల కలశ పూజ వైదిక కృతువులు నిర్వహించారు. స్వామివారికి వైభవంగా అభిషేకం నిర్వహించారు. విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు.

పశువుల పెంపకంపై అవగాహన



కరపత్రాలను అందజేస్తున్న యూనివర్శిటీ పశు వైద్యాధికారులు

ఏర్పేడు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పల్లం గ్రామంలో ఎస్‌వోఎస్ చిల్డ్రన్ విలేజెస్ సంస్థ గురువారం మహిళలకు పశువుల పెంపకంలో మెళకువలు అనే అంశంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించింది. ఎస్వీ వెటర్నరీ యూనివర్శిటీ నిరంతర పశు వైద్య విద్య, సమాచార కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ సుజాత, డాక్టర్ మంజరి ఇందులో పాల్గొన్నారు. పశువిజ్ఞాన కరదీపకను మహిళలకు పంపిణీ చేశారు. చింతలపాళెం, పల్లం గ్రామాల మహిళలు పాల్గొన్నారు.

మలయాళస్వామి విగ్రహానికి శంకుస్థాపన



శంకుస్థాపనలో శివానంద స్వామి, పూర్వ విద్యార్థులు

ఏర్పేడు, అక్టోబరు 16(ఆంధ్ర జ్యోతి): వ్యాసాశ్రమ వ్యవస్థాపకులు మలయాళ స్వామి విగ్రహ ఏర్పాటుకు గురువారం ఆశ్రమ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో శంకుస్థాపన జరిగింది. ఆశ్రమ పూర్వవిద్యార్థి, పుత్తూరుకు చెందిన జగన్నాత సేవాశ్రమ వ్యవస్థాపకులు శివానందగిరిస్వామి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వ్యాసాశ్రమంలో వచ్చే ఫిబ్రవరిలో శతాబ్ది ఉత్సవాలు జరగనున్నాయి. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి, కార్యదర్శి బాలరామరాజు, గాలి రవి, రామయ్య, ఏర్పేడు సర్పంచ్ శివయ్య, కృష్ణవేణి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రబీకీ నారుమళ్లు సిద్ధం



కేవీబీపురం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌కు వరిపంట వేసేందుకు రైతులు నారుమళ్లను సిద్ధం చేసుకున్నారు. గత ఏడాదితో పోల్చితే ఈ యేడాది ఎక్కువమంది వరికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు వ్యవసాయాధికారులు అంచనా. గత యేడాది 1,300హెక్టార్లలో సాగు చేయగా. ఈ యేడాది సుమారు 1,600 హెక్టార్లలో సాగు చేయటానికి సిద్ధంగా ఉన్నారని వ్యవసాయాధికారి మురళీకృష్ణ తెలిపారు. ప్రస్తుతానికి సుగర్‌లెస్ విత్తనాలకు డిమాండ్ ఉందన్నారు. ప్రభుత్వం ఇప్పటికీ విత్తనాలు సరఫరా చేయలేదు. ప్రైవేటు వ్యాపారుల వద్ద కొనుగోలు చేస్తున్నారు.

కలంకారీ, మగ్గం ఆర్యవర్క్‌లో శిక్షణ



శిక్షణలో పాల్గొన్న గ్రామస్థులు

ఏర్పేడు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఇసుక తాగేలి పంచాయతీలో ఆర్‌ఎస్ఈటీఐ, సెర్ప్-డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో కలంకారీ, మగ్గం, ఆర్యవర్క్ పెయింటింగ్ శిక్షణ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమాన్నిఎమ్మెల్యే బజ్జొల సుధీర్ రెడ్డి సతీమణి రిషితారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. గ్రామ సమాఖ్యలోని 35మందిని బ్యాచ్‌గా ఎంపిక చేసి శిక్షణ ఇస్తున్నారు. నెల రోజుల పాటు శిక్షణ ఇస్తారు. మధ్యాహ్న భోజన వసతి కల్పిస్తున్నారు. శిక్షణ అనంతరం సభ్యులకు బ్యాంకు ద్వారా రుణ వసతి కల్పించేందుకు కృషి చేస్తామని ఎల్‌డీఎం రవి చెప్పారు. టీడీపీ మహిళానేతలు కృష్ణవేణి, హంసవేణి, పార్టీ నాయకులు పొన్నారావు,మహేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆంగ్లంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఆంగ్లంలో నైపుణ్యం పెంపొందించాలని ఎంఈవో -2 మునిసుబ్రమణ్యం సూచించారు. కారణిమిట్ట ప్రాథమిక పాఠశాలను ఆయన గురువారం సందర్శించారు. విద్యార్థుల ఇంగ్లీషు వర్క్‌బుక్స్‌ను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఆంగ్లంపై విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహించాలన్నారు.

అనుమతి లేకుండా టపాసులు విక్రయిస్తే చర్యలు



వెంకటేశ్వరులు

పిచ్చాటూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): అనుమతులు తీసుకోకుండా టపాసులు విక్రయిస్తే వారిపై నాన్‌బెయిల్‌బుల్ కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ వెంకటేశ్వరులు హెచ్చరించారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రజలు టపాసులు కొనుగోలు విషయంలో సంయమనం పాటించి లైసెన్సు దారుల వద్ద మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. ఫిర్యాదులొస్తే చర్యలు తప్పవన్నారు

వంతెన నిర్మాణం కలేనా?



గోవర్ధనపురం వంతెన దుస్థితి ఇది

వరదయ్యపాళెం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెంలోని శ్రీకాళహస్తి మార్గంలోని గోవర్ధనపురం వంతెన నిర్మాణం కోసం ప్రజలు దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్నారు. ఇక్కడి మారేడు కాలువ ఏటా వరద సమయంలో పొంగిపొర్లి ప్రవహిస్తుంది. ఆమార్గంలో రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తుంది. భారీ వర్షాలు కురిసిన ప్రతిసారీ వరదయ్యపాళెం ప్రజలకే కాకుండా అటు వైపు వెళ్ళే శ్రీకాళహస్తి, తడ ప్రయాణికులకు అవస్థలు ఎదురవుతున్నాయి. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో పోలీసులు కాలువ వెంబడి తాళ్ళుకట్టి ప్రజలను ఇటు, అటు దాటవేస్తుంటారు. ఈ వంతెనను తగినంత ఎత్తు పెంచి నిర్మించాలని స్థానిక ప్రజలు ఎన్నోసార్లు మొర పెట్టుకున్నా ఫలితం లేకుండా పోతోంది. దీంతో వర్షాలు మొదలైతే మండల ప్రజలకు కష్టాలు తప్పడంలేదు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి వంతెన నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ముక్కంటి సేవలో మాజీ మంత్రి కన్నా



శ్రీకాళహస్తి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని గురువారం మాజీ మంత్రి, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆశీర్వదించారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

యూరియా కార్డుల పంపిణీ

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో రైతులకు వ్యవసాయ విస్తరణ అధికారిణి రేవతి గురువారం ఎరువుల కార్డులను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ వరి, వేరుశనగ పంటలకు యూరియా ఎరువులను కోటా పద్ధతిలో పంపిణీ చేయడానికి ఈ కార్డులను ఇస్తున్నామన్నారు. పాసుపుస్తకం, ఆధార్ కార్డు జెరాక్స్ తీసుకురావాలన్నారు. ఎకరానికి మూడు దపాలలో మూడు యూరియా బస్తాలను అందజేస్తామన్నారు.

డిప్యూటీ ఎంపీడీవోగా షణ్ముగరామ్



బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ ఎంపీడీవోగా షణ్ముగరామ్ గురువారం బాధ్యతలు చేపట్టారు. తిరుపతిలో డీపీఆర్‌సీ కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్న ఈయన పదోన్నతిపై డిప్యూటీ ఎంపీడీవోగా వచ్చారు.

స్త్రీ నిధి రుణాల పోస్టర్ల ఆవిష్కరణ

సత్యవేడు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్త్రీ నిధి రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని స్త్రీ నిధి క్లస్టర్ మేనేజర్ ఆదిల్ బాష పేర్కొన్నారు. దాసుకుప్పంలో గురువారం వెలుగు ఏపీఎం డాంగే యాదవ్ ఆధ్వర్యంలో స్త్రీనిధి రుణాల పోస్టర్‌లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వెలుగు కో ఆర్డినేటర్ పుల్లయ్య, సంఘమిత్రలు నాగమణి, మంజుల, ధన తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

వరదయ్యపాళెం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సంతవేలూరు దళితవాడలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ బీజేపీ మండల అధ్యక్షుడు డిల్లీ ప్రకాష్, డీవీఎంసీ మెంబర్ గుత్తి త్యాగరాజు గురువారం డిప్యూటీ ఎంపీడీవో శివ కుమార్‌కు వినతి పత్రం అందించారు. డిప్యూటీ ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన శివకుమార్‌ను కలిసి ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితవాడలో కొన్ని రోజులుగా తాగునీరు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తాగునీటి సరఫరా పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని శివకుమార్ ఆదేశించారు.

ఈవోను కలిసిన బోర్డు సభ్యుడు



ఈవో బాపిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాగరాజు

శ్రీకాళహస్తి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తలమండలి సభ్యుడిగా నియమితులైన కొప్పర్ల నాగరాజు గురువారం ఈవో బాపిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన నాగరాజును సత్కరించారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. వేదపండితులు ఆయనకు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఇరిగేషన్ టెక్నికల్ ఆఫీసర్ వంకీపురం వేణు, టీడీపీ నాయకులు కోట చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ



భోజన నాణ్యతను పరిశీలిస్తున్న హేమలత

శ్రీకాళహస్తి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలను కార్వేటినగరం డైట్ సీనియర్ లెక్చరర్ హేమలత గురువారం పరిశీలించారు. ఆమె పాఠశాలలో టీచర్ హ్యాండ్‌బుక్, అసైన్‌మెంట్ బుక్స్, విద్యార్థుల ప్రగతి, హోలిస్టిక్‌కార్డు, స్టూడెంట్ అటెండెన్స్ తదితర అంశాల తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయులు తీగల వెంకటయ్య, నౌజియా, సీఆర్‌ఎంటీ మునిమోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈ దారిలో వెళ్లాలంటే అవస్థలే



కేవీబీపురం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసపురంలోని ధర్మరాజు స్వామి గుడివీధి రహదారి కొద్దిపాటి వర్షానికే చిత్తడిగా తయారవుతోంది. ఆలయానికి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పక్కా రోడ్డు మంజూరయినా స్థానిక వివాదాల నేపథ్యంలో రోడ్డు నిర్మాణం పెండింగ్ పడినట్లు తెలిసింది. ఆరు నెలలు ఆ రోడ్డులో వెళ్లాలంటే గ్రామస్థులు, విద్యార్థులు ఇబ్బందులుపడుతున్నారు. అధికారులు స్పందించి సీసీరోడ్డు నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

గిరిజన కాలనీని ఊరిస్తున్న వెలుగులు

స్తంభాలు వేసి ఏడాదవుతున్నా కల్పించని విద్యుత్ సదుపాయం





గిరిజనకాలనీలో వేసిన విద్యుత్ స్తంభాలు- బిగించని ట్రాన్స్‌ఫార్మర్

ఏర్పేడు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పాత వీరాపురం గిరిజనకాలనీ వాసులను విద్యుత్ వెలుగులు ఊరిస్తున్నాయి. 70 ఏళ్లుగా కాలనీలో విద్యుత్‌దీపాలు లేవు. గతేడాది సాధారణ ఎన్నికల ప్రచారానికి వచ్చిన ప్రస్తుత ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిని సందర్శించారు. కాలనీ వాసుల అభ్యర్థన మేరకు విద్యుత్ సదుపాయం కల్పిస్తామని మాటిచ్చారు. ఈక్రమంలో ఏడాది క్రితం ఎమ్మెల్యే సూచనలతో విద్యుత్ శాఖ అధికారులు కాలనీకి కరెంటు స్తంభాలు వేశారు. తీగలను లాగారు. ఏడాది కావస్తున్నా విద్యుత్ సరఫరా చేయలేదు.. రెండు నెలల క్రితం ట్రాన్స్‌ఫార్మర్ కూడా పంపారు. ట్రాన్స్‌ఫార్మర్ అమర్చి విద్యుత్ సదుపాయం కల్పించాలని గిరిజకాలనీవాసులు కోరుతున్నారు. ఎమ్మెల్యే చొరవ తీసుకుంటేనే వెలుగుస్తాయంటున్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఈవో పీఆర్డీ ప్రభురావు

రేణిగుంట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఈవోపీఆర్డీ ప్రభురావు సూచించారు. కరకంబాడీ పంచాయతీ కార్యాలయ ఆవరణలో గురువారం సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు, పంపు ఆపరేటర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దెబ్బతిన్న నీటి పైపులను గుర్తించి సరిచేయాలని తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఏఎన్ఎంలను ఆదేశించారు. ప్రబలుతున్న విషజ్వరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సీఐటీయు నాయకులు పంచాయతీ కార్యదర్శి రమేష్‌బాబుకు వినతిపత్రం సమర్పించారు. సర్పంచ్ ఈశ్వరమ్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'జీఎస్టీతో పేదలకు ఒరిగిందేమీలేదు'



నిరసన తెలుపుతున్న చింతామోహన్,కాంగ్రెస్ శ్రేణులు

సత్యవేడు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో పేదలకు ఒరిగిందేమీ లేదని మాజీ ఎంపీ డాక్టర్ చింతా మోహన్ పేర్కొన్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి గవాయిపై జరిగిన దాడిని నిరసిస్తూ సత్యవేడులో స్థానిక గాంధీ విగ్రహం వద్ద గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఆయన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనూ, రాష్ట్రంలోనూ దళితులపై దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. హర్యానాలో దళిత డీజీపీ వేధింపులకు గురి కావడం వల్లే ఆత్మహత్యకు పాల్పడ్డారన్నారు. దేవళంపేటలో అంబేడ్కర్ విగ్రహంకు నిప్పుపెట్టడం హేయమైన చర్య అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి అటకెక్కి, అవినీతి పెరిగిందన్నారు. ఎమ్మెల్యేల అవినీతి తారాస్థాయికి చేరిందన్నారు. నిరసనలో పార్టీ శ్రేణులు పాల్గొన్నాయి.

జీఎస్టీ తగ్గింపుతో పెరిగిన వాహన కొనుగోళ్లు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు,డీలర్లు

శ్రీకాళహస్తి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ 2.0 ఫలాలు ప్రజల దరి చేరనివ్వకుంటే కఠిన చర్యలు తప్పవని మోటారు వాహనాల తనిఖీ అధికారి దామోదర్‌నాయుడు, జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ చిన్నారెడ్డి సంయుక్తంగా హెచ్చరించారు. స్థానిక శరవణ ఆటోమొబైల్ డీలర్స్ జీఎస్టీ 2.0పై అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ వాహనాల రంగంలో జీఎస్టీ 28 నుంచి 18శాతానికి తగ్గిందన్నారు. దీంతో వాహనాల కొనుగోలు ఊపందుకుందన్నారు. డీలర్లు షాపుల వద్ద జీఎస్టీ పట్టికను ప్రదర్శించాలన్నారు. పాత ధరలు అమలుచేస్తే జరిమానాతో పాటు క్రిమినల్ కేసులు పెడతామన్నారు. ఆటోమొబైల్స్ డీలర్స్ ప్రసాద్‌రెడ్డి, మురళీకృష్ణారెడ్డి, హీరోషోరూం మేనేజరు వేణుగోపాల్‌రెడ్డి, రమణయ్య, పలు షోరూంల నిర్వాహకులు పాల్గొన్నారు.


నిధులు సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీటీసీ సుమన్ కుమార్

నారాయణవనం, అక్టోబర్ 16(ఆంధ్రజ్యోతి): ఆర్థిక సంఘ నిధులను సద్వినియోగం చేసుకోవాలని జడ్పీటీసీ సుమన్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం నారాయణవనంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ దివాకర్ రెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సుమన్‌కుమార్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని కోరారు. సర్పంచ్‌లు, కార్యకర్తలు పల్లె పండుగ కార్యక్రమ బిల్లుల గురించి అడిగి తెలుసుకున్నారు. అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదని, ప్రజా ప్రతినిధులకు ప్రభుత్వ కార్యక్రమాలపై ఖచ్చితంగా సమాచారం ఇవ్వాలన్నారు. ఎంపీడీవో అరుణ, మండల అధికారులు పాల్గొన్నారు.

శుచికి,రుచికి ప్రాధాన్యం



భక్తులతో కలిసి భోజనం చేస్తున్న పద్మనాభరాజు

పిచ్చాటూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): నాగలాపురం మండలం సురుటుపల్లిలోని పల్లికొండేశ్వర ఆలయంలో గురువారం మధ్యాహ్నం ట్రస్టు బోర్డు చైర్మన్ పద్మనాభరాజు భక్తులతో కలసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యాన్నదానంలో రుచికి,శుచికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఆలయ పరిసరాలు పరిశుభ్రతగా ఉంచాలన్నారు. 30 మంది అధికారులు, సిబ్బంది ఉన్నా కొందరు గైర్హాజరు కావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రస్టు బోర్డు సభ్యులతో పాటు ఎ సతీష్‌నాయుడు, శివకుమార్, లక్ష్మణరాజు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



శ్రీకాళహస్తి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద గురువారం జనసేన నాయకులు పేట చంద్రశేఖర్, చిరంజీవి ఆధ్వర్యంలో పేదలకు డొక్కా సీతమ్మ పేరిట అన్నదానం చేశారు. వారు మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆశయాల మేరకు ప్రతి గురువారం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జనసేన నాయకులు ప్రదీప్‌కుమార్, తేజ, మణి, మహేష్, నవీన్, చందు, మునిచంద్ర, రాజా,చందు, వీరమహిళలు బత్తెమ్మపాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



మృతుని కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న రిషితారెడ్డి

శ్రీకాళహస్తి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): అక్కుర్తిలో ఇటీవల మృతి చెందిన టీడీపీ కార్యకర్త సత్యనారాయణ కుటుంబ సభ్యులను గురువారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి పరామర్శించారు. చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అండగా ఉంటామని ఆయన కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు.

కొత్తకండ్రిగ వంతెన పరిశీలన



వంతెనను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీదేవి

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వెస్ట్ వరత్తూరు, కొత్తకండ్రిగ గ్రామాల మధ్య కారణి యేరు కాజ్‌వేను గురువారం తహసీల్దార్ శ్రీదేవి పరిశీలించారు. భారీ వర్షాల నేపథ్యంలో కాజ్‌వేను దాటేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని ఆమె గ్రామస్థులకు సూచించారు. యేరు ఉధృతంగా ప్రవహిస్తే కాజ్‌వేపై వెళ్లకూడదని దండోరా వేయాలన్నారు. ఏడుగండ్ల వారధిని కూడా పరిశీలించారు.